జనరాజకీయం కోసం...
రూ॥ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 8 పక్షపత్రిక ఏప్రిల్ 16-30, 2010

## ప్రజాస్వామ్యంలో

### అతి పెద్ద తుపాకీని మించిన ఆయుధం... ప్రజల ఓటు





అల్లాపూర్‌లో ఇళ్ళు కూల్చివేసిన ఘటనలో బాధితులతో డా॥ జేపీ



డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్‌ని పుష్పమాలంకృతుని చేసిన సందర్భంగా డా॥ జేపీ, పార్టీ నాయకులు



మెడికోలతో వారి సమస్యలపై చర్చిస్తున్న డా॥ జేపీ



అంబేద్కర్ జయంతి సందర్భంగా బాలలతో డా॥ జేపీ



కోర్‌కమిటీ సమావేశంలో డా॥ జేపీ, పార్టీ నాయకులు



అత్యున్నత స్థాయి విద్య మనకు జ్ఞానాన్ని ప్రసాదించడమే కాక మన చుట్టూ వున్న ప్రపంచంతో మన జీవితానికి సామరస్య పూర్వకమైన వాతావరణాన్ని కలిగిస్తుంది.

-విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్

## లోపలి పేజీల్లో...


ఎన్ని లోపాలున్నా తుపాకీ పరిష్కారం కాదు............ 5

లోక్‌సత్తాది అహింసాయుత నక్సలిజం.................. 6

రాజ్యాంగం మీద దాడి........................................ 7

తొమ్మిది అంశాలతో జనంలోకి లోక్‌సత్తా............. 9

శ్రీకృష్ణ కమిటీకి నివేదిక....................................... 11

ఉపాధ్యాయసత్తా.................................................. 13

రాజకీయాల తీరు మార్చవలసిన బాధ్యత మనది కాదా..................................................14

జిల్లా వార్తలు.....................................................15

ప్రభుత్వ రికార్డులను మనం తనిఖీ చేయవచ్చు...... 26


# తొలి కర్తవ్యం

సంపాదకీయం

పాలకులు ఏం చేసినా, చేయకపోయినా పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ విద్యను అందించటం తొలి కర్తవ్యంగా అమలు చేయాలి. అభివృద్ధికి మూడే మంత్రాలని లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతోంది. అవి...

**విద్య...విద్య...విద్య....**

రకరకాల తాత్కాలిక ఉపశమనాలు ఇచ్చాక ప్రజలకు విద్యను అందిస్తే అభివృద్ధిని సాధించవచ్చని సంప్రదాయపార్టీల నేతలు చెబుతున్న మాటలు పచ్చి అవాస్తవం. విద్య లేకుండా అభివృద్ధిని సాధించిన సమాజం ప్రపంచంలోనే లేదు. రాష్ట్ర రాజధానిలోని బాలానగర్ మండలంలోని న్యూ అల్లాపూర్‌లో ఇళ్లు కూలగొట్టిన ఘటనలో 42 పేదకుటుంబాలు వీధిన పడటానికి వారికి చదువు లేకపోవటమే ప్రధాన కారణం. సుమారు 27 ఏళ్ల క్రితం స్థలాలు కొనుక్కుని, ఇళ్లు కట్టుకుని, పన్నులు చెల్లించినా వారికి చదువులేకపోవటంతో మసిపూసి మారేడుకాయ చేసి వారికున్న రూ.40-50కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు కుట్రపన్నారు. కోర్టు లావాదేవీలు, చట్టం తెలిసివుంటే ఈరోజు వాళ్లు మండుటెండలో వీధిన పడే పరిస్థితి ఉండేది కాదు.

గతం కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఈరోజు విద్య పేరుతో ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నా సరైన ప్రాధామ్యాలు లేకపోవటం వల్ల కోట్లాదిమందికి నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మిగిలిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏదో ఒక పేరుతో రూ.2,300కోట్లు ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు ధారపోస్తున్న సర్కారు... ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.100కోట్లుకూడా ఖర్చు చేయలేకపోతోంది. మాధ్యమిక విద్యామిషన్ పేరుతో మన రాష్ట్రానికి వస్తున్న రూ.710కోట్లను సద్వినియోగం చేస్తే మన హైస్కూళ్లన్నిటినీ బాగుచేయవచ్చు, కావలసిందల్లా రాజకీయ చిత్తశుద్ధి.

**ఆత్మవిశ్వాసం కలిగిన కొందరి చరిత్రే, ప్రపంచ చరిత్ర** - స్వామి వివేకానంద

# లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

**ఏప్రిల్ 16-30, 2010 సంపుటి - 1 సంచిక - 8**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరపున,
ప్లాట్ నం. బి 504, పాషాకోర్ట్స్, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


# మన రాజ్యాంగం

**153. రాష్ట్ర గవర్నర్**

ప్రతి రాష్ట్రమునకు ఒక గవర్నర్ ఉండవలెను.

ఒకే వ్యక్తిని ఒకటి కంటే మించిన రాష్ట్రములకు గవర్నర్‌గా నియమించవచ్చును.

**154. రాష్ట్ర కార్యనిర్వహణాధికారం**

1. రాష్ట్ర కార్యనిర్వహణాధికారములు అన్ని గవర్నర్‌లో నిహితమయి ఉండును. గవర్నర్ తన అధికారములన్నింటిని తనంతట తానుగా గానీ లేక కార్యనిర్వహణ కొరకు నియమితమయిన అధికారుల ద్వారా గాని వినియోగించవలెను.

**155. గవర్నర్ నియామకం**

1. గవర్నర్‌ను రాష్ట్రపతి నియమించును.

**156. గవర్నర్ హోదా కాలపరిమితి**

1. రాష్ట్రపతి అనుగ్రహం వున్నంతవరకు గవర్నర్ తమ హోదాలో కొనసాగును.
2. లిఖితపూర్వకంగా గవర్నర్ రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి అందజేస్తూ పదవిని వదులుకొనవచ్చును.
3. పైన ఉదహరించిన అంశాములకు లోబడి గవర్నర్ పదవీ స్వీకారం చేపట్టిననాటి నుంచి 5 సంవత్సరములపాటు పదవిలో కొనసాగును. అయినప్పటికి పదవీకాలము పూర్తిఅయిన తరువాత తదుపరి గవర్నర్ పదవిలో చేరునంతవరకు రాష్ట్ర గవర్నర్ తన పదవిలో కొనసాగును.

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవి, నచ్చనివి, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

**నీ జీవితాన్ని ఇతరుల జీవితాలతో పోల్చకుండా అనుభవించు - జువెనల్**

# రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.


## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజి 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు



**మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా**

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ప్లాట్ నం. బి 504, పాషాకోర్ట్స్, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com


## లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్: **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**

# ... ఎన్ని లోపాలున్నా తుపాకీ పరిష్కారం కాదు
# రాజ్యాంగాన్నిఅనుసరించటమే అంబేద్కర్‌కు నివాళి

కులం, మతం, ప్రాంతం, భాష తేడాలేకుండా వివక్షలేని సమాజాన్ని సృష్టించేందుకు, శాంతియుతంగా, సామరస్యంగా వివిధ వర్గాల విభేదాలను పరిష్కరించి సమాజాన్ని కలిపివుంచేందుకు బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని సాధనంగా అందించారు. అంబేద్కర్ పట్ల నిజమైన గౌరవం, భక్తి ఉంటే రాజ్యాంగాన్ని నిజాయతీగా అనుసరించాలి.





సంప్రదాయపార్టీలు, ప్రభుత్వాలు అధికారాన్ని ఆస్తిగా, దోపిడీకి మార్గంగా, రాజ్యాంగాన్ని అధికారాన్నిచ్చే సాధనంగా మాత్రమే ఉపయోగిస్తున్నాయి. రాజ్యాంగలక్ష్యాలు మౌలికమార్పు కోసమని ఈవేళ పాలకులకు, అధికారం కోసం పోటీపడేవారికి అర్థంకావాలి. ఈ దేశంలో అందరికీ ఎదిగే అవకాశం కల్పించటం కోసం రాజ్యాంగం గొప్ప మార్గాన్ని చూపెట్టింది. ఆ మార్గాన్ని అనుసరించకుండా, శాంతియుతంగా సమస్యలు పరిష్కారమవుతాయన్న విశ్వాసాన్ని కలిగించకుండా ... కేవలం ఎవరు ముఖ్యమంత్రి అయ్యారు, ఎవరు మంత్రులు అయ్యారు అనే జనాభా లెక్కలు వేసుకోవడంవల్ల కేవలం కొన్ని కుటుంబాలకే లాభం తప్ప సమాజానికి ప్రయోజనం ఉండదు. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు అందించి వివక్ష లేకుండా అందరూ ఎదిగే అవకాశాల్ని కల్పించే విధానాల్ని వదిలేసి ప్రజల్ని బిచ్చగాళ్లుగా కొనసాగించే తాయిలాల్ని ఇస్తుండటాన్నే రాజకీయంగా కొనసాగిస్తుండటంతో విద్యాహక్కు చట్టం అమలుకావటానికి మనదేశంలో 63ఏళ్లు పట్టింది. ప్రభుత్వ కబ్జాలు, కాంట్రాక్టుల్లో కమీషన్లతోపాటు పేద, మధ్యతరగతివారు కష్టపడి సంపాదించుకున్న స్థలాల్ని కూడా నేతలు ఆక్రమించుకుంటుంటే ఇక పేదరికం ఎలా పోతుంది?

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఈ 60ఏళ్లలో అనేక తీవ్రస్థాయి తప్పులు దొర్లాయి. అయితే ఆ తప్పుల్ని సరిచేయటానికి కొందరు సోదరులు చెబుతున్నట్టు తుపాకీ పట్టటం పరిష్కారం కాదు. తుపాకీ ద్వారా మార్పు వస్తుందనుకోవటం భ్రమ మాత్రమే. మన దగ్గర తుపాకీ ఉంటే ఇంకొకరి వద్ద ఇంకా పెద్ద తుపాకీ ఉంటుంది. చివరికి అందరికంటే పెద్దతుపాకీ ఉన్న రాజ్యం ఆధిపత్యం సాధిస్తుంది. ఈలోగా జరిగే హింసాకాండలో సామాన్య ప్రజలు చితికిపోతారు. కేవలం హింసతోనో, తుపాకీతోనో పరిష్కారం దొరుకుతుందనుకుంటే, ఒకరి వేళ్లతో మరొకరి కళ్లు పొడుచుకుంటుంటే లోకమంతా గుడ్డిదవుతుందని మహాత్మాగాంధీ ఏనాడో హెచ్చరించారు. ఈవేళ వివక్ష, అణచివేత ఉన్నాయి కాబట్టి పరిష్కారం తుపాకీ ఒక్కటే అనుకోవటం వల్ల అమాయకులు బలైపోతున్నారుతప్ప దేశంలో మౌలికమైన మార్పు మాత్రం రావటం లేదు. రాజ్యాంగంలో ఉద్దేశించిన, అంబేద్కర్ ఆశించిన సమానత్వం రావటం లేదు. కులవ్యవస్థ పోవట్లేదు.

రాజ్యాంగం ఏ లక్ష్యంతో ఆవిర్భవించిందో గుర్తించి ఆ మౌలిక మార్పుల సాధన కోసం ఇప్పటికైనా రాజ్యాంగాన్ని మౌలికమైన సాధనంగా చేసుకోవాలి. శాంతియుతంగా దేశంలో మౌలికమార్పులు సాధ్యమని రుజువుచేయాలి. లేకుంటే పేదలు, సంపన్నులు, దళితులు, అగ్రవర్ణాలు తేడా లేకుండా దేశం తీవ్రంగా నష్టపోతుంది. రాజ్యాంగం ద్వారా మార్పు నూటికినూరుపాళ్లూ సాధ్యం. రాజ్యాంగం దేవాలయం వంటిది. అందులో దేవుళ్లను ప్రతిష్ఠించేలోగానే దెయ్యాలు ప్రవేశించాయని ఆవేదన చెందుతూనే అంబేద్కర్ కన్నుమూశారు. రాజకీయాన్ని తిరిగి పవిత్ర వ్యాసంగంగా మార్చి రాజ్యాంగం పవిత్రతను పరిరక్షించేందుకు అందరూ కలిసిరావాలి. ▣

# లోక్‌సత్తాది అహింసాయుత నక్సలిజం

**పేదల్ని శాశ్వత బిచ్చగాళ్లుగా కొనసాగించే దుర్మార్గపు, వ్యాపార రాజకీయాన్ని అంతం చేసి అవినీతిపరులైన నేతల ఆస్తుల్ని జప్తుచేసి వారిని జైలుకు పంపించేందుకు లోక్‌సత్తా రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా అవిశ్రాంతం పోరాటం చేస్తోంది.**

పాలనను పూర్తిగా వికేంద్రీకరించి, గ్రామస్థాయి వరకూ జనం చేతికి అధికారాన్నివ్వటంతోపాటు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలను ఉచితంగా అందించి పుట్టుకతో వివక్ష లేకుండా అందరూ ఎదిగే అవకాశాలున్న సమాజాన్ని నిర్మించేందుకు పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణపై విరసం (విప్లవ రచయితల సంఘం) నేత వరవరరావు చేసిన విమర్శలు నిరాధారమైనవని, ఉద్దేశపూర్వకంగా చేసినవి. ఇటీవల ఓ ప్రైవేటు ఛానల్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలో నక్సల్స్ హింసను ప్రోత్సహిస్తూ చేస్తున్న వాదనలను జేపీ ఖండించినందుకే పనిగట్టుకుని జేపీపై వరవరరావు, మరికొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. కూకట్‌పల్లిలో ఓ బాలిక అత్యాచారానికి గురైతే కూడా అక్కడి ఎమ్మెల్యేగా జేపీ పరామర్శకు వెళ్లలేదని పూర్తి అవాస్తవ, చౌకబారు ఆరోపణలు కూడా చేశారు (ఆ బాలిక కేసును నిష్పాక్షికంగా పరిశోధన చేయించి కేసు నమోదు చేసి వాస్తవాలు వెలుగులోకి తేవటమేకాకుండా బాధితులకు న్యాయం చేయించేందుకు జేపీయే పోరాడుతున్నారని స్థానిక ప్రజలకు తెలుసు. మీడియాలో కూడా వివరాలు వచ్చాయి). ప్రజాస్వామ్యంలో అభిప్రాయభేదాలు సర్వసాధారణం. విభేదించినవారందర్నీ శత్రువులుగా చూపిస్తూ నిరాధార నిందలు చేస్తుంటే అవి అనాగరిక, నియంతృత్వ ధోరణులే అవుతాయి. లక్ష్యాలను రాజ్యాంగబద్ధంగా సాధించే సహనం, కష్టపడే శక్తి లేక అడ్డదారుల్లో, హింసామార్గంలో లక్ష్యసాధనకు పూనుకోవటమేకాకుండా, హింసను నిరసించేవారిని ప్రపంచబ్యాంకు ఏజెంట్లు వంటి పడికట్టు పదాలతో నిందించటం కొన్ని వర్గాలకు ఫ్యాషనై పోయింది. సంప్రదాయ పార్టీలలాగే విప్లవకారులు కూడా ప్రజల్ని గొర్రెల్లాగే చూస్తూ వారిని ఉద్ధరించేందుకు తామేదో ఆకాశం నుంచి దిగివచ్చిన మహానేతల్లా మాట్లాడుతుంటారు. కానీ ప్రజలు ఎవరి జీవితంలో వారే హీరోలని, వారి చేతికి అధికారం ఇచ్చేస్తే అన్నీ వారే చక్కదిద్దుకోగల విజ్ఞత గలవారని లోక్‌సత్తా భావిస్తుంది. "అన్ని అధికారాలూ ఉన్న 'స్వయందిద్దుబాటు వ్యవస్థల్ని' గ్రామస్థాయి నుంచీ ఏర్పాటుచేసి, ప్రభుత్వం కేవలం పర్యవేక్షక అనుసంధానకర్తగా మాత్రమే వ్యవహరించాలన్న లోక్‌సత్తా రాజకీయమే మార్క్సిస్టులు కలలుగంటున్న రాజ్యరహిత వ్యవస్థ అని విప్లవవర్గాల వారు గుర్తించాలి. అందుకే లోక్‌సత్తాది అహింసాయుత నక్సలిజం అని జయప్రకాష్ నారాయణ్ అనేక సందర్భాల్లో చెప్పారు.

సైద్ధాంతిక బలం ఉన్నవారు విభేదాల్ని హేతుబద్ధంగా, ఆరోగ్యకరమైన చర్చ ద్వారానే పరిష్కరించుకుంటారు. వాదనలో పస లేనప్పుడే హింసకు, నిందలకు పాల్పడతారు. పేదల్ని శాశ్వత బిచ్చగాళ్లుగా కొనసాగించే దుర్మార్గపు, వ్యాపార రాజకీయాన్ని అంతం చేసి అవినీతిపరులైన నేతల ఆస్తుల్ని జప్తుచేసి వారిని జైలుకు పంపించేందుకు లోక్‌సత్తా రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా అవిశ్రాతం పోరాటం చేస్తోంది. ఈవేళ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని న్యూ అల్లాపూర్‌లో పేదల ఇళ్లు కూల్చివేస్తే వారి తరుపున నిలబడి పోరాటం చేస్తూ వారి హక్కుల్ని పరిరక్షిస్తున్నది లోక్‌సత్తాయే. రాజ్యాంగాన్ని తోసిపుచ్చి తుపాకీ ద్వారా పోరాటం చేయాలనుకుంటే అన్నిటికంటే పెద్దతుపాకీ ఉన్న రాజ్యవ్యవస్థ ఎక్కువ హింసకు పాల్పడి గెలుస్తుంది. ఇద్దరి మధ్య పోరాటంలో సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. హింస ఎన్నటికీ మార్గం కాదు. కన్నుకు కన్నే పరిష్కారమైతే సమాజం అంధకారంగా మారిపోతుంది. 'తుపాకీ పరిష్కారం కాదు... రాజ్యాంగమే మార్గం'. ఈ నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా పోరాడుతున్న లోక్‌సత్తా విధానాల ద్వారా కాకుండా కోట్లాది అణగారిన ప్రజల్ని ఆత్మగౌరవం, స్వావలంబన గల పౌరులుగా తయారుచేసే మార్గాలేమిటి?

అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షల్నీ నెరవేర్చి సమతను సాధించగలిగే అద్భుత డాక్యుమెంట్‌గా ఎంతో దార్శనికతతో మన రాజ్యాంగనిర్మాతలు భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. దాన్ని విఫలం చేస్తున్న దోపిడీ రాజకీయాన్ని సరిదిద్దేందుకు కూడా రాజ్యాంగబద్ధంగానే పోరాడాల్సివుంది. కుల, మత, ప్రాంత, భాష వివక్షలేకుండా అందరికీ ఓటు హక్కు ఉన్న ప్రజాస్వామిక వ్యవస్థలో ఓటును ఆయుధంగా మలిచేందుకు వీలుగా ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు హింసావాదులు ఇప్పటివరకూ ఎందుకు కృషి చేయలేదు. ప్రజలను వారి కాళ్ల మీద నిలబెట్టే విద్య, ఆరోగ్యం కోసం ఎందుకు పోరాటం చేయలేదు. వాదనల్లో పసలేనప్పుడే హింసను, దౌర్జన్యాన్ని ఆశ్రయిస్తారు. వ్యవస్థలో మార్పు అంత తేలిగ్గా రాదు. లోక్‌సత్తా కూడా అలా అడ్డదారులు వెతుక్కుని ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచి, ఎజెండా ప్రాతిపదిక లేకుండా ఎడాపెడా పొత్తులు పెట్టుకుని ఉంటే ఎన్నికల్లో ఇప్పటికే అనేక సీట్లు గెల్చుకుని ఉండేది. ▣

కేసీ ఆర్ అంతర్యుద్ధ హెచ్చరిక

# రాజ్యాంగం మీద దాడి

- డి.వి.వి.ఎస్. వర్మ

ఒకవేపు శ్రీకృష్ణ కమిటీకి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకత మీద నివేదిక సమర్పిస్తూనే తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె.చంద్రశేఖర రావు ఈ కమిటీ మీద తన అవిశ్వాసాన్ని కూడా ప్రకటించారు. తద్వారా తెలంగాణ ఏర్పాటుకు సాగుతున్న ప్రజాస్వామ్య ప్రక్రియ పట్ల తన వ్యతిరేకతను చాటిచెప్పారు. అంతటితో ఆగకుండా ప్రత్యేక రాష్ట్రం ప్రకటించకపోతే అంతర్యుద్ధం తప్పదని హెచ్చరించారు. ఇవన్నీ తాత్కాలిక ఉద్రేకంలో నోరు జారిన మాటలుగా పరిగణించడానికి వీలు లేదు. ఎందుకంటే ఆయన చాలా కాలంగా రాజ్యాంగ విరుద్ధమైన అంశాలను నినాదాలు చేస్తూ వస్తున్నారు. ఇది దానికి క్లైమాక్స్ మాత్రమే. భారత రాజ్యాంగం ప్రజల మౌలిక చట్టం. మన ప్రజాస్వామ్య మనుగడ, మన ప్రజల ప్రాథమిక హక్కులు, స్వయంపాలన అన్నీ దీని నుండే సంక్రమిస్తున్నాయి. పార్లమెంటు, శాసన సభలు, న్యాయవ్యవస్థ, ప్రభుత్వాలు అన్నీ ఈ రాజ్యాంగం పరిధిలోనే ఏర్పడి పని చేస్తున్నాయి. కేసీఆర్ హెచ్చరికలు కేవలం ప్రభుత్వం మీద దాడిగా ఎవరూ భావించకూడదు. ఇది రాజ్యాంగం మీద, ప్రభుత్వం మీద, పౌరులు ప్రాథమిక హక్కుల మీద దాడి.

**ప్రత్యేక తెలంగాణ కోసం ప్రచారం చేసుకోవడానికి వారికి పూర్తిగా హక్కు ఉంది. అదే సమయంలో భిన్నాభిప్రాయం వ్యక్తం చేసే హక్కు ఇతరులకీ ఉంది. తెలంగాణలో రాజ్యాంగ హక్కుల మీద దాడికి అది నాంది అయింది. తర్వాత జెఏసి కూడా దీనినే పదే పదే ప్రకటిస్తూ వచ్చింది. ఇది తెలంగాణ వాదానికీ, సమైక్యతావాదానికి చెందిన సమస్య కాదు. పౌరుల ప్రాథమిక హక్కుల సమస్య. రాజ్యాంగాని ఉల్లంఘించడానికి సంబంధించిన అంశం.**

కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు రాజ్యాంగం వీలు కల్పిస్తున్నది. అయితే అది ఒక ప్రాంతానికి చెందిన పార్టీలు కోరినంత మాత్రానే సాధ్యం కాదు. ఒక రాష్ట్ర శాసనసభ ఆమోదించడంతోనే కూడా ఏర్పాటు కావు. దేశం ఆమోదించాలి! అంటే దానికి ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు అంగీకరించాలి. సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కేంద్రంలో ఒకటి రెండు పార్టీలు ఆమోదించినంత మాత్రాన సరిపోదు. గతంలో ఒక ఓటు, రెండు రాష్ట్రాల నినాదంతో ఎన్నికల్లో పోటీ చేసిన బిజెపి తాను అధికారంలోకి వచ్చినా ప్రత్యేక తెలంగాణను ఏర్పాటు చేయలేకపోయింది. ఇందులో బిజెపి చిత్తశుద్ధిని శంకించాల్సిన పనిలేదు. వాస్తవానికి తన భాగస్వామ్యపక్షాలు ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీ వ్యతిరేకించడంతో ఆనాడు వారికి సాధ్యం కాలేదు. ఇప్పుడు పరిస్థితి దానికి భిన్నంగా లేదు.

ప్రస్తుత కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలు మధ్య ఇంకా ఏకాభిప్రాయం రాలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని కూలగొట్టుకుని ప్రత్యేక రాష్ట్రాలను ఇచ్చే పరిస్థితి గతంలో బిజెపికి గాని ప్రస్తుతం కాంగ్రెస్‌కి గాని లేదు. ఈ కారణాల వల్లే మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా పార్లమెంటులో అటకెక్కింది. దానికి మెజారిటీ మద్ధతు లేక కాదు. కాని బిల్లు పాసై తరువాత ప్రభుత్వం కొనసాగే అవకాశం లేదు. ఈ పరిస్థితులన్నీ కేసీఆర్‌కు తెలుసు. అందరినీ ఒప్పించడం ద్వారా ఒక ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా తెలంగాణ సాధనకు సంయమనంతో సాగించాల్సిన ఉద్యమాన్ని కేసీఆర్ తన రాజకీయ అధిపత్య ఉద్యమంగా భావించి ఇలాంటి దుందుడుకు నినాదాలను ఇస్తున్నారు.

తెలంగాణ సాధన కోసం రాజ్యాంగం మీద తిరుగుబాటుకు కేసీఆర్ ఒక పథకం ప్రకారం అడుగులు వేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అయినా దానికే కట్టుబడి ఉన్నట్టు కనిపిస్తున్నది. కేసీఆర్ ఇస్తున్న నినాదాలే ఇందుకు రుజువులుగా ఉన్నాయి. భావప్రకటనపై దాడి : తెలంగాణ ప్రాంతంలో మరో అభిప్రాయం ప్రచారంలో లేకుండా చెయ్యడంతో కేసీఆర్ తన ఆధిపత్య రాజకీయానికి అరంగ్రేటం చేశారు. తెలంగాణను సమర్ధించని వారిని గ్రామాలలో తిరగనిచ్చేది లేదని, తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడితే నాలుకలు తెగకోస్తామని ప్రకటించారు.

ప్రత్యేక తెలంగాణ కోసం ప్రచారం చేసుకోవడానికి వారికి పూర్తిగా హక్కు ఉంది. అదే సమయంలో భిన్నాభిప్రాయం వ్యక్తం చేసే హక్కు ఇతరులకీ ఉంది. తెలంగాణలో రాజ్యాంగ హక్కుల మీద దాడికి అది నాంది అయింది. తర్వాత జెఏసి కూడా దీనినే పదే పదే ప్రకటిస్తూ వచ్చింది. ఇది తెలంగాణ వాదానికీ, సమైక్యతావాదానికి చెందిన సమస్య కాదు. పౌరుల ప్రాథమిక హక్కుల సమస్య రాజ్యాంగాన్ని ఉల్లంఘించడానికి సంబంధించిన అంశం. ప్రాంతీయ ఏర్పాటు ఉద్యమాలు ప్రపంచంలో ఎక్కడైనా తమ ఆధిపత్యం సాధనకు అనుసరించే తొలిమెట్టునే కేసీఆర్ అనుసరించారు. ప్రజల్ని భయభ్రాంతుల్ని చెయ్యడం ద్వారా పౌరస్వేచ్ఛను హరించడంతో అవి మొదలవుతాయి.

**జాగో– బాగో:** తెలంగాణ ప్రజలు మేల్కొనాలని తెలంగాణేతరుల్ని వెళ్ళగొట్టాలనీ ఈ నినాదం సారాంశం. దేశంలో పౌరులు ఎక్కడైనా నివసించడానికి, జీవించడానికి ఉన్న ప్రాథమిక హక్కు మీద ఇది దాడి మాత్రమే కాదు. ఒక పథకం ప్రకారం ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొట్టడానికి, స్థానికుల మధ్య అనుమానాలు, సంఘర్షణలకు ఇది పునాది వేస్తుంది. అంతర్యుద్ధానికి బీజాలు వేస్తుంది. అందుకు తగిన భూమికను ఏర్పాటు చెయ్యడానికి ఈ నినాదం ద్వారా కేసీఆర్ సంకల్పించారు.

**రాజ్యాంగ సంక్షోభం :** కేసీఆర్ నిరాహరదీక్ష అనంతరం తెలంగాణాలో పరిస్థితి పూర్తిగా మారింది. వివిధ పార్టీలు రంగప్రవేశం చేశాయి. విద్యార్థులు ప్రముఖపాత్ర వహించారు. అంతకుమించి అన్ని స్థాయిలలో బడుగు, బలహీన వర్గాల వారు ఉద్యమంలో పాత్రధారులయ్యారు. నాయకత్వం అందుకుంటున్నారు, ఈ స్థితిలో ఉద్యమాన్ని తన ఆధిపత్యం రాజకీయం పరిధిలోకి తెచ్చుకోవడానికి "ప్రజాప్రతినిధుల రాజీనామాలతో రాజ్యాంగ సంక్షోభం" అనే నినాదాన్ని ఇచ్చారు. రాజీనామాల ద్వారా తెలంగాణ రాదన్న వాస్తవం కేసీఆర్ కంటే బాగా తెలిసిన వారెవరూ లేరు. అందుకే ఆయన రాజీనామా చెయ్యకుండా మిగిలిన వాళ్లతో రాజీనామా చేయించారు. దీని ద్వారా ఆయన మూడు లక్ష్యాలు సాధించదల్చుకున్నారు.



**మొదటిది:** ఆ ఉద్యమం అందరికీ కావడం ఆయన ఆధిపత్యం రాజకీయానికి సరిపడదు. ఉద్యమంలో చేరిన పార్టీలను, ఇరుకునపెట్టి ఆధిపత్యం సాధించడం. **రెండవది** – బడుగు బలహీనవర్గాల నాయకత్వం పాత్రను తొలగించి ప్రజాప్రతినిధుల రాజీనామాల పరిధిలోకి ఉద్యమాన్ని తీసుకురావడం **మూడోది** – రాజ్యాంగ సంక్షోభం నినాదానికి అందరి అంగీకారాన్ని పొందడం ఆయన సాధించిన ప్రయోజనాలను పక్కన పెడితే రాజ్యాంగ సంక్షోభం నినాదాన్ని తెలంగాణలోని అన్ని ప్రధాన పార్టీలు సూత్రప్రాయంగా ఆమోదించాయి. అదే తెలంగాణ సాధనకు ఏకైక మార్గంగా ప్రకటించాయి. కాని రాజీనామాలకు మాత్రం వెనుకాడాయి. ఇక్కడ కూడా అదే ప్రశ్న. తెలంగాణను ప్రజాస్వామ్యబద్ధంగా సాధించుకోవడాన్ని ఎవరూ కాదనరు. కాని దానికి రాజ్యాంగ సంక్షోభాన్ని సాధనంగా ఎంచుకోవడం ఇది ప్రజాస్వామ్యంలో విశ్వాసం లేనివాళ్ళు మాత్రమే ఎంచుకునే మార్గం. దానినే కేసీఆర్ ఎంచుకున్నారు.

**అంతర్యుద్ధం:** అంతిమంగా ఏప్రిల్ 16వ తేదీన కేసీఆర్ రెండు విషయాలను స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే అంతర్యుద్ధం తప్పదని హెచ్చరించారు. ఒకవైపు నివేదిక ఇస్తూనే శ్రీకృష్ణకమిటీ పట్ల తన అవిశ్వాసాన్ని ప్రకటించారు. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియ పట్ల ఆయనకున్న విశ్వాసరాహిత్యాన్ని స్పష్టం చేస్తున్నది. దాని పర్యవసానంగానే ఆయన అంతర్యుద్ధం హెచ్చరికను చేశారనేది విశదం అవుతోంది. ఈ ప్రకటనల ద్వారా కేసీఆర్ మన రాజ్యాంగం మీద, ప్రజాస్వామ్య ప్రక్రియ మీద ప్రత్యక్ష దాడికి సిద్ధం అయ్యారు. కేసీఆర్ సాగిస్తున్న ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నిజస్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పరిణామాలు అందరికీ కనువిప్పు కావాలి. ఇందులో తెలంగాణ సాధన కంటే ఆధిపత్య రాజకీయానికే ఆయన ప్రాధాన్యతనిస్తూ వచ్చారు.

తెలంగాణ సమస్యకు కేసీఆర్ నినాదాలు ఒక పరిష్కారం కాదు. తన ఆధిపత్య రాజకీయానికి ఆయనకు తెలంగాణ ఒక సాధనం మాత్రమే. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఇప్పుడు స్థూలంగా రెండు ప్రధాన స్రవంతులు కనిపిస్తున్నాయి. ఒకటి – రాజ్యాంగ సంక్షోభం, అంతర్యుద్ధం, స్వయంపాలన నినాదాలతో సాగుతున్న ప్రజాస్వామ్య ప్రక్రియకు విరుద్ధమైన ఉద్యమం ఒకవైపు కేసీఆర్, మరొకవైపు మావోయిస్టులు ఇదే నినాదాలను ఇస్తున్నారు. మరొకటి రాజ్యాంగ ప్రక్రియలో భాగంగా తెలంగాణ సాధన కోసం ప్రయత్నిస్తున్న వారు. స్థూలంగా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఈ ధోరణిలో ఉన్నట్లు కనిపిస్తునది.

ఇలాంటి పరిస్థితులలో ఎలాంటి గందరగోళానికి లోను కాకుండా తెలంగాణ ప్రజలు సంస్థలు తమ మార్గాన్ని నిర్ధారించుకోవలసి ఉంది. ప్రత్యేక రాష్ట్ర సాధన అంతర్యుద్ధం ద్వారానా లేక ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారానా అన్నది తేల్చుకోవాలి. పత్రికలు, ప్రసార మాధ్యమాలు, వీర మేధావులు, విప్లవ విద్యావంతులు అందరూ మౌనాన్ని వీడి తమ వైఖరి ఏమిటో ప్రకటించారు. పౌరహక్కులు మీద గగ్గోలు చేసే ప్రొఫెసర్లు, సంస్థలు తమ వైఖరిని స్పష్టం చెయ్యాలి.

ఇప్పటి వరకు వాళ్ళు తేలుకుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారు. ఎందుకంటే మనసులో మావోయిజం, మాటల్లో ప్రజాస్వామ్యంతో ద్వంద ప్రమాణాలు పాటించే వారికి మౌనం కంటే భూషణం మరొకటి ఉండదు. అందుచేత ప్రత్యేక తెలంగాణ సాధనకు అంతర్యుద్ధం మాత్రం సాధనం కారాదు. రాజ్యాంగ మీద, పౌరస్వేచ్ఛ మీద ప్రాథమిక హక్కుల మీద దాడిచేసి ఇలాంటి ఆధిపత్యం రాజకీయానికి ఇకనైనా చరమగీతం పాడి తీరాలి. లేకపోతే మన ప్రజాస్వామ్యం అర్ధరహితం. ▣

### నాలుగేళ్లలో 50 వేలమంది నాయకుల్ని తయారుచేస్తాం : జేపీ

# తొమ్మిది అంశాలతో జనంలోకి లోక్‌సత్తా

### 'జనం చేతిలో పాలన' వల్ల ఫలితాలపై అవగాహన కల్పిస్తాం

రాజకీయాల రూపురేఖల్ని మార్చి, పౌరుడు కేంద్రంగా సాగే పాలన సాధించడం కోసం ఏర్పడిన లోక్‌సత్తా ఒక రాజకీయ పార్టీగా తన అనుభవాల్ని ఆధారం చేసుకుని నవ్యపంథాలో ముందుకువెళ్ళాలని నిర్ణయించింది. రాబోయే ఆరునెలల్లో లోక్‌సత్తా పార్టీ శ్రేణులు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రజాజీవితంలోకి చొచ్చుకుపోవాలని, ఒక క్రమబద్ధమైన ప్రణాళికతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ తీర్మానించింది. ఏప్రిల్ 2,3 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన లోక్‌సత్తాపార్టీ జిల్లా శాఖల సమీక్షా సమావేశాల్లో పార్టీ నేతలు ఈమేరకు తొమ్మిది తీర్మానాల్ని ఆమోదించారు.

ప్రజలు లోక్‌సత్తా ఎజెండాను బలంగా ఆమోదించినప్పటికీ రెండు కారణాలవల్ల వారు ఎన్నికల్లో ఓటు వేయడానికి సంకోచించారు. రాజకీయాల రూపాన్ని మార్చేందుకు కావల్సిన నాయకత్వ లక్షణాలుండికూడా యువత, చదువుకున్నవారు, మధ్యతరగతి ప్రజలు నిరాసక్తత చూపడం ఒక కారణమైతే బలంగా వున్న రెండు సంప్రదాయ పార్టీలకు తప్ప మరోపార్టీకి ఓటువేస్తే తమ ఓటు వృధా అవుతుందని జనం భావించడం రెండో కారణం. లోక్‌సత్తా ఓటుబ్యాంకులో వాటా కోసం పుట్టింది కాదు. అధికారాన్ని బాధ్యతగా భావించిందేకానీ, దాన్నే పరమార్థం అనుకోలేదు. తమ ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చుకోవడం తమ చేతుల్లోనేవుందని, తమ భవిష్యత్‌కు తామే కర్తలమని ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకుంటేతప్ప రాజకీయాల అర్థం మారదు. దురదృష్టవశాత్తూ చాలామంది ప్రజలు రాజకీయాల్ని ద్వేషిస్తూ పోలింగ్‌బూత్‌లకు దూరం కావడంవల్లే కొందరు నాయకులు, కొన్ని కుటుంబాలు రాజకీయాల్ని ఘరానా వ్యాపారంగా మార్చేశాయి. రాజకీయాల్లోని కుళ్ళును విమర్శించడం మాని రాజకీయాల్ని ప్రక్షాళన చేయడానికి ప్రజలే ముందుకురావాలి. ఈ నేపథ్యంలో ... ప్రజలకు రాజకీయాలపై అవగాహన కల్పించడం, తమ జీవితాల్లో వెలుగులు నింపుకోవడం కోసం రాజకీయాలను ఉపయోగించుకోవడంపై వారిని మేల్కొలపడం దిశగా లోక్‌సత్తా ముందుకు వెళ్ళాలని నిర్ణయించింది. ఇందుకోసం తొలి అడుగుగా, రాబోయే నాలుగేళ్ళలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనుంచి 50వేలమంది ఉత్సాహవంతులైన నాయకుల్ని పార్టీ రూపొందిస్తుంది. వీరు తమ సామర్థ్యంతో స్థానిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తారు. అలాగే, పట్టణ ప్రాంతాల్లో వార్డు ప్రభుత్వాల ఏర్పాటు ద్వారా స్థానిక వనరుల్ని సవ్యంగా వినియోగించుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం రాష్ట్రంలోని ప్రతి మండలం నుంచి ఐదు గ్రామాలను ఎంపిక చేసి, ఒక ఏడాది వ్యవధిలో అక్కడ పార్టీ కార్యక్రమాల్ని విస్తృతం చేస్తాం. రాజకీయాలకూ, జనజీవితానికీ మధ్యవున్న సంబంధం గురించి పది పాయింట్ల ఎజెండాతో ప్రజలలో అవగాహన కల్పిస్తాం.

పుట్టిన ప్రతి బిడ్డకీ పుట్టిన కులం, జాతితో సంబంధం లేకుండా అందరికీ సమానంగా విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు అందించినప్పుడే మనదేశంలో పేదరికం సమసిపోతుందని లోక్‌సత్తా బలంగా నమ్ముతోంది. రాబోయే ఎన్నికలమీద దృష్టితో ప్రజలకు కల్పిస్తున్న తాత్కాలిక ప్రయోజనాలు ఫలితాలనివ్వవు, అవి ప్రజల్ని మరింత పేదరికంలోకి తోసేస్తున్నాయి. అధికారాలు, బాధ్యతలు, వనరుల్ని వికేంద్రీకరించి, పాలన ఎక్కడికక్కడ స్థానికంగా జరగకపోతే జనం జీవితాల్లోకి వెలుగు రాదు. అవినీతి సమసిపోదు. లోక్‌సత్తా ఇకనుంచీ తన ఎజెండాతో ప్రజల్లోకి చొచ్చుకువెళ్తుంది. వారి భవిష్యత్‌కు వారినే వ్యూహకర్తలుగా మార్చేందుకు కృషి చేస్తుంది.

ప్రభుత్వం అందించాల్సిన పౌరసేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ఆధారంగా ముందుకు వెళ్ళాలని, తద్వారా ఎక్కడికక్కడ ప్రజలే తమ హక్కుల్ని తాము కాపాడుకోగలుగుతారని, స్థానికంగా పాలన తమ చేతుల్లోవుంటే ఎన్ని ప్రయోజనాలుంటాయో వారికి అర్థమవుతుందని పార్టీశ్రేణులు అభిప్రాయపడ్డాయి. ఇందుకు బాటలువేసే ఉద్దేశంతో లోక్‌సత్తా 'పల్లెవెలుగు' పేరుతో ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. **'ఇళ్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, సురక్షితమైన మంచినీటి సరఫరా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, వెయ్యి చిన్న పట్టణాల ఏర్పాట్లు, వాటిలో మౌలిక సదుపాయాల కల్పన, గ్రామ న్యాయాలయాల ఏర్పాట్లు'** అనే తొమ్మిది అంశాల ప్రాతిపదికన ఇకనుంచీ పార్టీ శ్రేణులు ప్రజల్లో అవగాహన, ఆచరణ కార్యక్రమాల్ని చేపడతాయి.

గ్రామాల్లో గృహావసరాలకోసం 24 గంటలూ విద్యుత్ సరఫరా, ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందించే ఏర్పాట్లు, ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు మొదలైన ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని లబ్ధిదారులు సక్రమంగా ఎలా పొందవచ్చో

వారికి అవగాహన కల్పించడం, గ్రామంలోని పిల్లలందరినీ పాఠశాలలకు పంపించే కృషిచేయడం, పాఠశాలల పరిస్థితులను మెరుగుపరచడం, సదుపాయాల కల్పన, గ్రామాల్లోని అట్టడుగువర్గాలవారికి ఆరోగ్యజాగ్రత్తలు సూచించడం, గర్భిణులు, వృద్ధులకు స్థానిక ఆరోగ్యకేంద్రాల్లో మంచి వైద్యసేవలు అందేలా చూడడం, చిన్నపిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన చర్యల గురించి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను పార్టీ చేపడుతుంది. వ్యవసాయదారులకోసం అగ్రిక్లినిక్‌ల ఏర్పాటు, ఆయా గ్రామాల వాతావరణాలకు అనుగుణంగా అక్కడ పండే పంటలపై అవగాహన ఏర్పరచడం, భూసార పరీక్షలు నిర్వహించడం, రైతులకు లాభసాటైన పాడి, కోళ్ళపరిశ్రమల ఏర్పాట్లు, ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలను వివరించడం, గ్రామ మార్కెట్ యార్డుల ఏర్పాటుకు పార్టీ కార్యకర్తలు కృషిచేస్తారు. నిరుద్యోగులకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇప్పించడం ద్వారా వారి ఉపాధి అవకాశాల్ని మెరుగుపరచడం, చిన్నపట్టణాలను గుర్తించి, ప్రభుత్వంతో సంప్రదింపులద్వారా వాటికి మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామపంచాయితీలకు తలసరి వెయ్యి రూపాయల అభివృద్ధి నిధులు అందేలా ప్రయత్నిస్తారు. కేంద్రం ఆమోదించి 1800 కోట్ల రూపాయల నిధుల్ని కూడా విడుదల చేసిన గ్రామ న్యాయాలయాల ఏర్పాటు కోసం రాష్ట్రప్రభుత్వంమీద ఒత్తిడి తీసుకువచ్చి ప్రజలకు సత్వర న్యాయం అందేలా చేయడంపై కూడా పార్టీ శ్రేణులు పోరాడతాయి.

**అలాగే, కింది అంశాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతూ సదస్సు తీర్మానించింది.**

- 1975 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులనుంచి 14 (ఎఫ్) క్లాజ్‌ను తొలగించాలి.
- రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు కోసం హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటుచేయాలి.
- ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు అందరికీ అమలు చేయాలి.
- గ్రామాలకు 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలి.
- నిరుద్యోగులకు ఉపాధి నైపుణ్య శిక్షణ ఇవ్వాలి.
- పాఠశాల విద్యాకమిటీలను ఏర్పాటు చేయాలి.
- వార్డు కమిటీల్లో అన్ని రాజకీయ పార్టీలకూ భాగస్వామ్యం కల్పించాలి.
- ప్రతి మండలంలో వెంటనే గ్రామన్యాయాలయాలను ఏర్పాటుచేయాలి. ▣

## పిసినారి రాజు-చమత్కారి కవి



అనగనగా ఒక పిసినారి రాజు. తాను ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నట్లు తనకు తానే భావించుకునేవాడు. ఆయనకు ఒక ఆలోచన వచ్చింది. తనను దానకర్ణుడుగా వర్ణిస్తూ ఏవరైన కవిత్వం రాస్తే బావుంటుందనిపించింది. వెంటనే ఒక కవిని పిలిచాడు. తనపై పద్యం రాయమని కోరాడు. దానికి ప్రతిఫలంగా ఏమిచ్చేది చెప్పలేదు. కవికి కూడా తెలుసు ఈ పిసినారి రాజు ప్రజలకే ఏమివ్వలేదని, ఇక తనకేమిస్తాడనుకున్నాడు. రాయనంటే రాజుకు కోపం, రాస్తే వచ్చేదేమీ లేదు. కాని రాయకతప్పదు. అప్పుడు ఆ కవి ఆ పిసినారి రాజుపై ఇలా పద్యం రాసాడు.

**ఇచ్చిచ్చెను రాజు ఏమిచ్చినాడన**
**ఇంటిలోపలనుండనిచ్చినాడు**
**పోరుగూళ్ళవెంబడి పోయి ముష్టెత్తుక**
**ఇంటికి తిరిగిరానిచ్చినాడు**
**చలివడంకుడు ప్రక్కశయంబు లేకుంటే**
**చేతులు ముడుచుకోనిచ్చినాడు**
**గాశానికొకవేళ కలిగియుండకపోతే**
**ఇంటింటపస్తుండనిచ్చినాడు**
**వీధులందునతిరగబోనిచ్చినాడు**
**భిక్షుకుండనిబ్రతకబోనిచ్చినాడు**
**చేసుకున్నంత భోంచేయనిచ్చినాడు**
**ఇట్టిపనులెల్ల రక్షించునీశ్వరుండు**

మన ఓటుతో ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. మన పన్నుల డబ్బులతో పాలన సాగుతుంది. కానీ ప్రస్తుత రాజకీయ నాయకులు ప్రజల సొమ్మునే ప్రజల పేరుమీద ఖర్చు చేస్తున్నట్లు నటిస్తున్నారు. ప్రజల డబ్బును అందినంత కాడికి దోచుకుంటున్నారు. పైగా తామేదో ప్రజలకు వరాలిస్తున్నట్టు ప్రకటిస్తున్నారు. కాని మన పిసినారి రాజులాగా వారు మనకు ఇచ్చేది ఏమీ లేదు అని చెప్పడానికి పై పద్యం పనికొస్తుంది. ▣

**వ్యాఖ్యానం : బందారు రామ్మోహన్‌రావు, సేకరణ : పల్లెర్ల రామ్మోహన్‌రావు**

# శ్రీకృష్ణ కమిటీకి 117 పేజీల సమగ్ర నివేదిక ఇచ్చిన లోక్‌సత్తా

* * *

- తెలంగాణపై ఏ నిర్ణయమైనా అధికార వికేంద్రీకరణతోనే అసలైన స్వయంప్రతిపత్తి
- రాజ్యాంగబద్ధ గ్యారంటీతో ప్రాంతీయ మండళ్లు, జిల్లా కౌన్సిళ్లు ఏర్పాటుచేసి జనం చేతికి అధికారం ఇచ్చే చర్యల్ని తక్షణం చేపట్టాలి"
- 14 (ఎఫ్) తొలగించేలా రాష్ట్రపతి ఉత్తర్వు (1975)ను సవరించాలి

సుమారు పదేళ్లక్రితం తొలినుంచీ తీసుకున్న వైఖరికి కట్టుబడి, ప్రాంతానికో మాటలేకుండా అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి లక్ష్యంగా నిర్దిష్టంగా పార్టీ తరపున ఒకే నివేదికను అందించారు. విమర్శలకన్నా... హేతుబద్ధ విశ్లేషణకు, సమస్యను శాశ్వతంగా పరిష్కరించే కోణానికే నివేదికలో ఎక్కువ ప్రాధాన్యతనివ్వటం కన్పిస్తుంది.

తెలంగాణ డిమాండ్‌పై ఆషామాషీ వ్యవహారశైలి తగదని లోక్‌సత్తా పార్టీ హెచ్చరించింది. ఒకే భాష ఉన్నప్పటికీ రెండుగా విడిపోవాలని డిమాండ్లు చోటుచేసుకుంటున్న తొలి హిందీయేతర రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొంది. "రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు జాతీయ, వాస్తవిక, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రాతిపదిక ఉండటం అవసరం. ఇప్పటివరకూ భాష అలాంటి ప్రమాణంగా ఉంటూ వచ్చింది. ఒక భాష- ఒక రాష్ట్రం ప్రాతిపదికన అన్ని హిందీయేతర రాష్ట్రాలు ఏర్పడ్డాయి. మన రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించే ముందు ఇతర ప్రాతిపదికల్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది. చరిత్ర లేదా భౌగోళిక పరిస్థితులు లేదా అభివృద్ధి... ప్రాతిపదికగా సరిపోవు. రాష్ట్రాల విభజనకు హేతుబద్ధ ప్రాతిపదిక ఏమిటి? జవాబులతోపాటే మనకు పరిష్కారాలు లభిస్తాయి. దేశంలోని ఒక ప్రాంతంలో తాత్కాలిక ధోరణితో వ్యవహరిస్తే మరో ప్రాంతంలో డిమాండ్లు చెలరేగవచ్చు, తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చు. కాబట్టి, అందరికీ ఆమోదయోగ్యం, దీర్ఘకాలిక ప్రయోజనాల పరిరక్షణ ప్రాతిపదికన హేతుబద్ధ, స్పష్టమైన దృక్పథం అవసరం".




దేశంలోనే మొదటిసారిగా పెద్ద రాజధాని నగరం కలిగి ఉన్న ఒక ప్రాంతంలోని వర్గాలు ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండ్ చేస్తున్నారు. "ఇప్పటివరకూ కొత్త రాష్ట్రం కోసం వచ్చిన ప్రతి డిమాండ్ కూడా రాష్ట్ర రాజధానికి దూరంగా ఉన్న ప్రాంతాల నుంచి వచ్చినదే. హైదరాబాద్ కేవలం మరో నగరం కాదు. 85లక్షల జనాభాతో, తెలంగాణలో 25శాతం జనాభాను కలిగి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అత్యధిక వాటాను అందిస్తూ చెన్నయ్ బెంగళూరుతో సమానంగా ఉన్న నగరమది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన లక్షలాది మంది హైదరాబాద్‌ను సొంతిల్లుగా చేసుకున్నారు. వారి పూర్వీకుల మూలాలు వేరెక్కడో ఉన్నా భావోద్వేగాలపరంగా నగరంతో ఎంతో అనుబంధాన్ని పెంచుకున్నారు. అటువంటి పరిస్థితిలో, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఆషామాషీ వ్యవహారశైలి ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది".

కేంద్రీకృత పాలన వల్ల తమకు రాజకీయ ప్రాతినిధ్యం కొరవడిందని, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి కోల్పోయామని సహేతుకమైన అసంతృప్తులు తలెత్తాయని, ప్రజల్లో నెలకొన్న ఈ అసంతృప్తుల్ని, ఆవేశాల్ని హేతుబద్ధంగా విశ్లేషించి అందరికీ మేలుచేసే దిశగా పరిష్కారాన్ని చూపించే ప్రయత్నం చేయకుండా, వాటిని రెచ్చగొట్టి ప్రజల మధ్య ప్రాంతాలవారీగా చిచ్చుపెట్టి ఓట్లు లబ్ధి పొందేందుకే సంప్రదాయపార్టీలు ప్రయత్నిస్తూ 21వ శతాబ్దంలో 19వ శతాబ్దపు రాజకీయాల్ని చేయటం వల్లే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది. ఓట్లశాతాన్ని బట్టి సీట్లు కాకుండా... ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే అనే లోపభూయిష్ట ఎన్నికల విధానం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రజల్ని శాశ్వత బిచ్చగాళ్లుగా కొనసాగించే పథకాలను అమలుచేయటం వల్ల పేదరికం, వెనకబాటుతనం, అవినీతి, అవకాశాలు లేకపోవటం, నిరుద్యోగం ప్రజల్ని అసహనానికి గురిచేస్తోందని పేర్కొంది.

"పనిచేసే స్వేచ్ఛతో పాటు నిధులు లేకపోవటం, బ్యూరోక్రసీ పెత్తనం వాటిని అణగదొక్కటంతో 1960ల నుంచి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ప్రభుత్వాలు సత్తా కోల్పోయాయి. 73, 74వ రాజ్యాంగ సవరణలు వచ్చినా స్థానిక ప్రభుత్వాలకు సాధికారత ఆచరణలోకి రాలేదు. మితిమీరిన కేంద్రీకృత పాలనకు తోడు సాధికారత కలిగిన ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కమిటీని 1973లో రద్దు చేయటం. రాజకీయ ప్రాతినిధ్యం కొరవడిన భావనను, ఏకాకితనాన్ని పెంచింది."

ఈ నేపథ్యంలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి తక్షణం వ్యవస్థీకృత ఏర్పాట్లను ప్రారంభించాలని లోక్‌సత్తా పార్టీ సూచించింది. "ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ ఆకాంక్షలకు సంబంధించి తుది ఒప్పందం కోసం ఓ పక్క ప్రయత్నాల్ని కొనసాగిస్తూనే ప్రాంతాల అభివృద్ధికి వ్యవస్థీకృత ఏర్పాట్లను చేయాలి".

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ అసమానతల్ని ప్రస్తావిస్తూ, వెనకబాటుతనం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో విస్తరించి ఉందని నివేదిక పేర్కొంది. 1956 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రాంత పట్లయినా ఓ పద్ధతిప్రకారం, ఉద్దేశపూర్వక వివక్ష ఏమైనా ఉందా అనే అంశాన్ని లోక్‌సత్తా సునిశితంగా పరిశీలించింది. అలాగే వివిధ ప్రాంతాలు, జిల్లాల వారీగా దీర్ఘకాలిక ఆర్థిక ప్రగతి, తలసరి ఆదాయం, సామాజిక ఇండికేటర్లను కూడా పరిశీలించింది.

బడ్జెట్ కేటాయింపులపై రంగాలవారీగా, జిల్లాలవారీగా స్థూల విశ్లేషణ చేస్తూ, రాష్ట్ర వనరులు వివిధ పథకాల ఎప్పుడూ సమానంగానే పంపిణీ అయ్యాయని నివేదిక పేర్కొంది. ప్రజాపంపిణీ వ్యవస్థ, పేదలకు ఇళ్లు, వృద్ధులకు, వితంతవులు, వికలాంగులకు పెన్షన్లు, విద్యాకేటాయింపులు, ఆరోగ్యరక్షణ కార్యక్రమాలు వంటి కొన్ని పెద్దస్కీముల్లో కేటాయింపుల్ని ఉదహరించింది. వాటి కేటాయింపులు స్థూలంగా జనాభాకు నైష్పత్తికంగా ఉన్నాయని పేర్కొంది.

విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటులో వివక్ష ఉందనటానికి ఎటువంటి ఆధారాలు లేవని నివేదిక పేర్కొంది. సరఫరా, పంపిణీ మౌలికవసతులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మొత్తం పరిస్థితి ఒకేలా ఉందని తెలిపింది. భౌగోళిక పరిస్థితులు, ముందుగా వినియోగం ప్రాతిపదికగా తప్ప నదీజలాల వినియోగంలో ఉద్దేశపూర్వక వివక్ష లేదా న్యాయబద్ధ వాటా తిరస్కరణ వంటివి ఉన్నాయనటానికి వాస్తవిక ఆధారం లేదని నివేదిక పేర్కొంది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి జాతీయ కార్యక్రమాల కింద భారత ప్రభుత్వం విడుదల చేసే నిధుల వినియోగంలో ప్రాంతాలవారీగా వ్యవస్థీకృతంగా వివక్ష చూపలేదని నివేదిక తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర వెనకబడిన ప్రాంతాల సమస్యలను పరిష్కరించేందుకు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు తక్షణం ఈ దిగువ పేర్కొన్న వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలని లోక్‌సత్తా పార్టీ ప్రతిపాదించింది:

1. ఆర్టికల్ 371 (డి)కింద జారీ అయిన రాష్ట్రపతి ఉత్తర్వు (1975)లోని 14 (ఎఫ్) సెక్షన్‌ను తొలగించి సవరించాలి. తద్వారా హైదరాబాద్ సిటీ జోన్‌లో పోలీసు సిబ్బంది నియామకాల్ని సైతం ఆరుసూత్రాల (ఎస్‌పిఎఫ్) జోనలైజేషన్/ లోకలైజేషన్ పరిధిలోకి తీసుకురావాలి.

2. ఆర్టికల్ 371 (1)ని పునరుద్ధరించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ కౌన్సిళ్లను తిరిగి ఏర్పాటు చేయాలి: నిజమైన ప్రాంతీయ స్వయంప్రతిపత్తికి, రాజకీయ సాధికారతకు ప్రాంతీయ కౌన్సిళ్లు విలువైన, ఫలవంతమైన, శక్తిమంతమైన మార్గంగా ఉపయోగపడతాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ కౌన్సిళ్ల ఏర్పాటుకు, అధికారాల వికేంద్రీకరణకు వ్యవస్థీకృత ఏర్పాట్లకు, జిల్లా, ఉప జిల్లా స్థాయిల్లో స్వయంప్రతిపత్తికి రాజ్యాంగబద్ధ గ్యారంటీ కల్పించాలి. విస్తరించిన ఎస్.ఆర్.ఓ 443-ఎ ను తగిన మార్పులతో తిరిగి జారీ చేయాలి.

3. ఎన్నికైన, పూర్తి అధికారాలున్న జిల్లా కౌన్సిళ్లు, నగర/ మెట్రో ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం- జిల్లా వారీ బడ్జెట్‌ను తప్పనిసరి చేయటం- స్థానిక ప్రభుత్వాలకు తలసరి ప్రతి పౌరునికీ నేరుగా గ్రాంట్‌లు కేటాయించటం- భారత సమాఖ్య వ్యవస్థలోని మూడో అంచె పాలనావ్యవస్థను పటిష్టం చేయటం. రాజ్యాంగబద్ధ గ్యారంటీ ద్వారా పూర్తి నిధులు, అధికారాలు ఉన్న జిల్లా కౌన్సిళ్ల ఏర్పాటు. అవినీతిపై నిష్పాక్షిక విచారణ, చర్యలకు జిల్లాస్థాయిలో స్వయంప్రతిపత్తిగల అంబుడ్స్‌మన్ ఏర్పాటు.

4. రాష్ట్రపతి ఉత్తర్వు (1975), ఆరుసూత్రాల ఫార్ములా పూర్తిస్థాయిలో, నిక్కచ్చిగా అమలు జరిగేలా చూసేందుకు స్వయంప్రతిపత్తిగల, విశ్వసనీయ, ప్రభావవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయటం

5. రాజ్యాంగబద్ధ గ్యారంటీలు కలిగిన సాధికారత కలిగిన ప్రాంతీయ అభివృద్ధి మండళ్లు (ఆర్‌డిసిలు) ఏర్పాటు చేయటం: ఎ) ఈ ఆర్‌డిసిలకు వాస్తవిక అధికారాలు ఉంటాయి. రాష్ట్ర అభివృద్ధి బడ్జెట్ నుంచి ఆ ప్రాంతానికి సంబంధించి గణనీయమైన, నిర్దిష్టమైన వాటా ప్రతి ఆర్‌డిసికి వెళ్తుంది. స్థానిక ప్రభుత్వాల పనితీరును ఆర్‌డిసిలు పర్యవేక్షిస్తాయి. రాష్ట్రపతి ఉత్తర్వును పూర్తిస్థాయిలో, వెంటనే చేసే బాధ్యత ఉంటుంది. బి) రాష్ట్ర శాసనసభ, ప్రభుత్వానికి ఆర్‌డిసిలు జవాబుదారీతనంతో వ్యవహరించే పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలి

6. తెలంగాణ, ఇతర వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి నదీజలాలు కీలకంకాబట్టి ఆ జలాల పంపిణీ, వినియోగానికి సంబంధించి వివిధ ప్రాంతాల మధ్య ఉన్న విభేదాల్ని తొలగించాలి: మన రాష్ట్రంలోని నదీబేసిన్ల భౌగోళిక విస్తరణ, డ్రైనేజీ విధానాల్ని పరిగణలోకి తీసుకుని కృష్ణా, గోదావరి నదీ బేసిన్ల అంతర్రాష్ట్ర జలాల వివాదాల చట్టబద్ధ ట్రిబ్యునల్ లేదా ట్రిబునళ్లు ఏర్పాటు చేసేటప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ అవసరాల్ని కూడా సంప్రదింపుల నిబంధనల్లో భారత ప్రభుత్వం చేర్చాలి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నదీజలాల నిల్వ, నదీప్రవాహాల పంపిణీ, వరదల అంచనా, నియంత్రణకు శాశ్వత, శాస్త్రీయ, సకాల నిర్ణయ ప్రక్రియను వ్యవస్థీకృతం చేసేలా భారత ప్రభుత్వం సాధికార నిపుణుల కమిటీ ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేయాలి

7. 'గ్రోత్ కారిడార్ల'తో ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికాభివృద్ధి ప్రోత్సాహకానికి భారత ప్రభుత్వ ప్యాకేజీ: వెనకబడ్డ ప్రాంతాలలో శరవేగంగా అభివృద్ధికి దోహదం చేసే 'ర్యాపిడ్ గ్రోత్ కారిడార్ల'ను గుర్తించి ఏర్పాటు చేయాలి. ఆ క్యారిడార్లలో 'విద్యా జోన్లు', వ్యవసాయ గ్రీన్‌జోన్లు', పారిశ్రామిక జోన్లు' ఏర్పాటు చేసేందుకు జాతీయ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఉదారంగా పెద్దఎత్తున ప్యాకేజీ ఇవ్వాలి. ■

“నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల గౌరవం పెంపొందించటం, వివక్షలేకుండా అందరికీ విద్య” లక్ష్యంగా...

# లోక్‌సత్తాకు అనుబంధంగా ‘ఉపాధ్యాయ సత్తా’ ఏర్పాటు

విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేయాలని తొలినుంచీ పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీ... ఆ దిశగా సమాజంలో చైతన్యం పెంచేందుకు పార్టీకి అనుబంధంగా ఉపాధ్యాయ విభాగం ‘ఉపాధ్యాయ సత్తా’ను ఏర్పాటుచేసింది. విద్యారంగంలో ప్రమాణాలు పెంచటం, ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంపొందించటం, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించి ఎదిగే అవకాశాల్ని ఏర్పరచటం... అనే మూడు లక్ష్యాలతో ఉపాధ్యాయ సత్తాను ఏర్పాటు చేస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

విద్యారంగంలోని లోపాల్ని సరిదిద్దేందుకు విద్యారంగంలోనివారే ముందుకు రావాలని, అందుకే ఉపాధ్యాయ సత్తాను ప్రారంభిస్తున్నామన్నారు. అవినీతి అంటని సమాజం కేవలం అధ్యాపకవర్గమేనని, ఉపాధ్యాయుల్ని మించిన ఆస్తి సమాజానికి లేదని, అందువల్ల ఉపాధ్యాయ సత్తా తన లక్ష్యాన్ని సాధించి లోక్‌సత్తాకు కీలక అనుబంధ విభాగంగా రూపుదిద్దుకుంటుందని జేపీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆ తర్వాత ఉపాధ్యాయ సత్తా లోగోను జేపీ ఆవిష్కరించి, రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు.




**ఉపాధ్యాయ సత్తా రాష్ట్ర కార్యవర్గం**

అధ్యక్షుడు: ప్రొఫెసర్ ఎస్. విజయకుమార్, ప్రధాన కార్యదర్శి: ఎం. సత్తిబాబు, ఉపాధ్యక్షుడు: ఎస్. సొర్రు, సంయుక్త కార్యదర్శి: టి. వరదరాజు, కోశాధికారి: ఎ. నరేందర్, కార్యనిర్వహణ సభ్యులు: జి. డేవిడ్, బి. రేణుకాదేవి.

ఉపాధ్యాయ సత్తా కార్యక్రమాల సమన్వయకర్తగా లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యదర్శి జి. రాజారెడ్డి వ్యవహరిస్తారు. ▣

## విద్యతోనే సమాజంలో అసలైన మార్పు
## అందుకే లోక్‌సత్తాకు అనుబంధంగా ఏర్పడ్డాం

**దేశ స్వాతంత్ర్యం వచ్చాక ఇంతవరకూ ఏ పార్టీ ఇవ్వనిరీతిలో విద్యారంగానికి లోక్‌సత్తా పార్టీ ఇస్తున్న కీలక ప్రాధాన్యతను చూసి ఆ పార్టీ అనుబంధ విభాగంగా ఏర్పడుతున్నామని ఉపాధ్యాయ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ॥ విజయకుమార్, ప్రధాన కార్యదర్శి ఎం. సత్తిబాబు తెలిపారు. వ్యక్తులుగా తాము సాధించలేనిది లోక్‌సత్తాతో కలిసి సాధించగలమన్నారు. విద్యతోనే సమాజంలో అసలైన మార్పు సాధ్యమవుతుందని, పేదరికాన్ని శాశ్వతంగా తొలగించగలమని వారు స్పష్టంచేశారు.**

**రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఈ సంఘంలో సభ్యులుగా ఉంటారని ఉపాధ్యాయసత్తా నేతలు తెలిపారు. అదేవిధంగా పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులతోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల ఉపాధ్యాయులు కూడా ఇందులో చేరేందుకు అర్హులని చెప్పారు. త్వరలో జిల్లాలవారీగా, మండలాలవారీగా ఉపాధ్యాయసత్తా శాఖలను ఏర్పాటుచేసి సమస్యలపై పోరాటం ప్రారంభిస్తామని విజయకుమార్, సత్తిబాబు చెప్పారు.** ▣

## రెండు రాజకీయ పార్టీల జెండాల గొడవ కారణంగా భయం గుప్పెట్లో గ్రేటర్ వాసులా?

# ఈ రాజకీయాల తీరు మార్చవలసిన బాధ్యత మనది కాదా!

- **అనుమోలు రాఘవయ్య,** హైకోర్టు న్యాయవాది

ఓట్ల రాజకీయాలకై రాజకీయ పార్టీలు చేస్తున్న అనేక విన్యాసాలను మనం చూస్తూనే ఉన్నాం. ప్రస్తుత ప్రపంచీకరణ విధానంతో ప్రభుత్వాలను నడిపే రాజకీయ పార్టీలు, అధికార లక్ష్యంతోనో వ్యక్తిగత ఆపేక్షలతోనో కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ పథకాలను పేదల పేరు మీద ఆ కంపెనీలకు లాభాలు చేకూరుస్తున్నవి. సామాన్య మధ్య తరగతి వారికి కనీస గూడు నిర్మించుకోవటానికి స్థలం ఇవ్వలేని ప్రభుత్వాలు (ఏ పార్టీ అధికారంలో వున్నా) బడా సంస్థలకు 100 ల ఎకరాలను కేటాయిస్తూ అటు కంపెనీలు ఇటు ప్రభుత్వాలు నడుపుతున్న పార్టీ నాయకులు కోట్లకు పడగలెత్తుతున్న సంగతులు మనం చూస్తూనే ఉన్నాం.

రాజకీయం అంటే ఎన్నికలలో కోట్లు ఖర్చు పెట్టి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసి గెలుపే మార్గంగా అనేక అవకతవకలకు పాల్పడి రాజ్యాధికారం సాధించడం అనే సాంప్రదాయాన్ని ప్రస్తుత రాజకీయ పార్టీలు పెంచి పోషిస్తున్నాయని వాటికి కార్పొరేటు కంపెనీలు అండదండలుగా ఉంటున్నాయి అనేది మనందరికీ తెలిసిన సత్యమే.



రాజకీయ పార్టీలకు పునాది పేద మధ్య తరగతి ప్రజలు. ప్రపంచీకరణ పుణ్యామా అని ఆర్థిక పరిపుష్టత కోల్పోయి నిత్య జీవితంలో ప్రతి చిన్న అవసరానికై ఉదా: కనీస వైద్యం కొరకు రేషన్ కార్డు పొందుటకు, పిల్లలను ప్రభుత్వ హాస్టల్లో చేర్పించటానికి అధికారంలో ఉన్న స్థానిక రాజకీయ పార్టీల నాయకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వారి చుట్టూ యాచకులుగా తిరగవలసిన పరిస్థితులు వారికి ప్రస్తుత రాజకీయాలు అందించిన అభివృద్ధి ఫలాలు.

రాజకీయం వ్యాపారంగా మారిపోవటం వల్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు వ్యాపార సంస్థల ఏజెంట్లుగా మారి, లాభార్జనకై వారి వారి ఆధిపత్యం నిలుపుకోవటానికి విద్వేషాలు, విశ్వాసాలే పెట్టుబడిగా చేసి ఆయా పార్టీల ముసుగులో తమ తమ కార్యకలాపాలు నెరుపుతున్నారని, అధికార కాంక్ష, ఓట్ల రాజకీయం వ్యక్తిగత లబ్ధికై సదరు రాజకీయ పార్టీలు ఆయా కార్యకలాపాలకు మద్దతు తెలుపుతూ రాజకీయాలంటే ఏహ్యాభావము కల్గే విధంగా ప్రవర్తిస్తున్నాయనేది కూడా నిర్వివాదాంశమే.

తెలంగాణ విషయంలో రాజకీయ పార్టీల తీరుతెన్నులు మనందరం గమనించాం. జటిలమైన విషయాన్ని పెంచి పోషించి కలసి జీవిస్తున్న ప్రజలను రెండుగా చీల్చిన ఘనత మన రాజకీయ నాయకులకే చెల్లుతుంది. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం అధికార పార్టీలో ఆధిపత్య పోరు ప్రజలకు ఇబ్బందులు కలిగించిన పరిస్థితులు, ప్రక్క రాష్ట్రంలో గనుల డబ్బుతో రాజకీయాలు నడిపిస్తున్న తీరు మనము గమనిస్తూనే ఉన్నాం.

కాని రాజకీయం తీరు పరాకాష్టకు చేరి, ఓటు బ్యాంకు రాజకీయాలకై, ఆధిపత్యం నిలుపుకోవటానికి రాజకీయ పార్టీలు మతం అనే ఒక అస్త్రాన్ని ప్రయోగించి ప్రజలలో అభద్రతా భావాన్ని పెంచి దశాబ్దాల కాలంగా వారి వెనుకబాటు తనాన్ని, మత విశ్వాసాలను ఆసరాగా చేసుకొని, వారి విద్వేషాలే అస్త్రాలుగా రాజకీయ ప్రస్థానాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్న తీరుకు ప్రత్యక్ష ఉదాహరణ గతనెల గ్రేటర్ లో మనం అనుభవించిన భయంభ్రాంతులు. ఈ రాజకీయాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్న పోలీసు, ప్రభుత్వ యంత్రాంగాలు 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అను సామెత తీరుగా పనిచేస్తున్నాయి.

విచారకరమైన విషయం ఏమిటంటే గత నెల గ్రేటర్ వాసులను భయభ్రాంతులు చేసిన అల్లర్లకు కారణం – రెండు రాజకీయ పార్టీల జెండాల గొడవ.

పైరాజకీయాల ఫలితాలను మనందరం అనుభవిస్తున్నవారం. ముఖ్యంగా పేదమధ్య తరగతి ప్రజలు. ఈ వర్గాలే రాజకీయ పార్టీలకు పునాదులు. ఈ వర్గాల పిల్లలకు పరీక్షల సమయంలో కల్గిన ఆటంకాలు వారి భవితపై ఎటువంటి పరిణామాలు చూపుతాయో ఆలోచించాలి. రాజకీయ పార్టీలకు పునాదులైన ఈ వర్గాల వారు ఓటు ద్వారా ఆయా పార్టీల పునాదులు కదిలించాలి. రాజకీయాలకు మనం దూరంగా ఉన్నా అవి మనల్ని వెంటాడుతూనే ఉంటాయి. ఎందువల్ల అంటే ప్రజాస్వామ్యంలో రాజకీయం అంటే ప్రజా సంక్షేమంతో కూడిన ప్రక్రియ.

కాబట్టి మన సంక్షేమంతో కూడిన ప్రక్రియలో మనం భాగస్వాములం కాకుంటే స్వార్థపరుల చేత చిక్కి మన సంక్షేమాన్ని మనమే కాలరాసుకొంటున్న ఈ పరిస్థితిమారదు. ఓటు మన ఆయుధం. దానిని సక్రమంగా వినియోగిద్దాం. ▣

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

* * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * * *







## లోక్‌సత్తా ఆధ్వర్యంలో శ్రమదానం

**గుంటూరు జిల్లా, నరసరావు పేట:** స్థానిక లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో సురాజ్య ఉద్యమంలో భాగంగా రామిరెడ్డి పేట 20వ వార్డులో పార్టీ కార్యకర్తలు శ్రమదానం నిర్వహించారు. సిద్ధార్ధ కాన్సెప్ట్ స్కూలు విద్యార్ధులు 20 మంది తమ స్కూలు నుండి ఎస్.ఎస్.ఎన్. కళాశాల హాస్టల్ వరకు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రామిరెడ్డిపేట నవోదయ నగర్‌లో పోస్టర్లు తొలగించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్ధ స్కూలు డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటరావుల ఆధ్వర్యంలో విద్యార్ధులు రవితేజ, గుణసాయి, రాంబాబు, హేమంత్‌కుమార్, సూర్యప్రకాష్, గోపీచంద్, హేమంత్, సతీష్, రంగస్వామి, నాగతేజ, అశోక్, నవీన్ తదితరులు ఉండగా యువసత్తా కార్యకర్తలు అనిల్‌కుమార్, బాబులు ఈ శ్రమదానంలో 3 గంటలపాటు పనిచేశారు. ఈ కార్యక్రమాన్ని లోక్‌సత్తా పట్టణ అధ్యక్షులు ఈదర గోపీచంద్, పూజల హనుమంతరావు, పాత వెంకటేశ్వర్లు, ఆళ్ళ సుబ్బారెడ్డిలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోస్టర్లు తొలగింపు ఖర్చు బిల్లును తహశీల్దార్‌కు అందజేసి సినీ థియేటర్ల నుండి రాబట్టి విద్యార్ధులకు బహుమతిగా ఇస్తామని గోపీచంద్ ఈ సందర్భంగా ప్రకటించారు. అదే విధంగా తొలగించిన ప్రాంతాల్లో తిరగి పోస్టర్లు అంటిస్తే తిరిగి కేసులు పెడతామని హెచ్చరించారు.



## జ్యోతిరావ్‌పూలే జయంత్యుత్సవాలు

**హైదరాబాద్, మలక్‌పేట్ :** వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని మలక్‌పేట లోక్‌సత్తా ఇంఛార్జి వేణుగోపాల్ రావు కొనియాడారు. పూలే జయంతి ఉత్సవాలను ఆదివారం లోక్‌సత్తా పార్టీ నాయకులు సలీంనగర్‌లో నిర్వహించారు. అక్కడి నుంచి అంబర్‌పేటకు వెళ్లి, పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువసత్తా గ్రేటర్ హైదరాబాద్ ఇంఛార్జి, డి. రాము, నాయకులు ఆంజనేయులు, కిశోర్, సురేష్, శ్రీనివాస్, బాబురావు, వినోద్‌కుమార్, కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా, లోక్‌సత్తా ఆధ్వర్యంలో...

భారత మాజీ ఉపప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ 103వ జయంతి సందర్భంగా లోక్‌సత్తా పాల్వంచ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కొరకు జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుడికాల ఆంజనేయులు, శనగారం చందర్, సిహెచ్ బాబ్జి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

**విజయవాడ అర్బన్ జిల్లా , సూర్యారావుపేట :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 120వ జయంతి సందర్భంగా లోక్‌సత్తా పార్టీ, అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో 23వ డివిజన్‌లో కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలు సమీకరించి











బోధించు, పోరాడు అనే మాటలను లోక్‌సత్తా పార్టీ స్ఫూర్తిగా తీసుకుందని అన్నారు. అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రాజమణి మాట్లాడుతూ అంబేద్కర్ జాతికి ఎంతో సేవ చేసారని ముఖ్యంగా దళితుల అభ్యున్నతికి పాటుపడ్డారని, కాని 60 సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలో దళితుల స్థితిగతులు మారలేదని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తేనే గాని అంబేద్కర్ ఆశయాలు ఫలిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ అధ్యక్షురాలు పి.సరళకుమారి, అర్బన్ జిల్లా అధ్యక్షులు చుండూరి రాజేంద్రప్రసాద్, మహిళాసత్తా నాయకురాలు లలితసుధ, పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జి యం.ఎ. బేగ్, కార్యాలయ కార్యదర్శి బోజడ్ల సత్యానారాయణరావు మరియు అర్బన్ కార్యదర్శి బండ్లమూడి మురళీకృష్ణ, బండారు పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు వల్లూరు పూర్ణచంద్రరావు, బి.ఎ. రవికుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అధికారం సాధించే దిశగా ఎదగాలి

**ప్రకాశం ఒంగోలు, సంతపేట :** అధికారం సాధించే దిశగా లోక్‌సత్తా పార్టీ ఎదగాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. కర్నూలు రోడ్డులోని విరాట్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలు, నేతలు ప్రజల వద్దకు పోవాలన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వాలని, వ్యూహాత్మకంగా ముందుకు వెళ్ళాలని చెప్పారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పార్టీలు చొచ్చుకువెళుతుందన్నారు. ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు. పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం పెంపొందించే దిశగా నేతలు పనిచేయాలని కటారి సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి తగినంత కార్యకర్తలు, సిబ్బంది లేకపోవటం వల్లే విజయాన్ని అందుకోలేకపోయామని ఆయన అభిప్రాయపడ్డారు. దాన్ని అధిగమిస్తూ ప్రజల వద్దకు, ప్రజల్లోకి కార్యకర్తలు వెళ్లాలని, ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు కార్యాలయాలు మూసివేసుకునే స్థితిలో ఉంటే మన పార్టీ కార్యాలయాలు ప్రారంభించకోవటం అభినందనీయమన్నారు. ప్రజలకు కనీసం మంచినీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించలేని పార్టీలు పాలన చేస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు పాలించినా సమస్యలు తీరకపోవటం సిగ్గుచేటన్నారు. జిల్లా ఇంఛార్జి పార్థసారధి మాట్లాడుతూ ప్రజాసేవ చేస్తూ ప్రజలకు దగ్గరకు పోవాలంటూ, పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు అల్లు శివరమేష్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో మండలస్థాయి కమిటీలు నియమిస్తున్నట్లు చెప్పారు. రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను నిలిపి అధికారం చేపట్టే దిశగా అభివృద్ధి చెందుదామన్నారు. కార్యక్రమంలో పార్టీ సర్వజనసత్తా, సభ్యులు ఎండి. రఫీ అహ్మద్, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం సభ్యులు ఎన్. రాధాదేవి, అధికార ప్రతినిధి రావుల పురుషోత్తం, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇంఛార్జి వి.రాము, పార్టీ నేతలు కార్యకర్తలు హాజరయ్యారు.

కార్యాలయం ప్రారంభం సందర్భంగా కార్యాలయం ఆవరణలో జరిగిన రక్తదాన శిబిరంలో సుమారు 30 మంది

వరకు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ నేతృత్వంలో చేపట్టిన డాక్టర్ పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రమాద మృతులకు ఆర్థిక సాయం**

లోక్‌సత్తా సమావేశానికి వస్తూ ప్రమాదంలో మృతి చెందిన దర్శి నియోజకవర్గం ముండ్లమూరు గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలకు సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి పార్టీ అధ్యక్షుడు శివరమేష్ రెడ్డి రూ॥ 10 వేలు, రాష్ట్ర పార్టీ తరపున 10 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు.



**సేవాభావమే లక్ష్యం - సంకల్పమే ఊపిరి**

**నెల్లూరు జిల్లా:** తోటపల్లి గూడూరు మండలం చిన్నచెరుకూరు గ్రామానికి చెందిన వేమారెడ్డి కోదండరామిరెడ్డి ప్రస్తుతం నెల్లూరు బాలాజీనగర్‌లోని పుట్టవీధిలో ఉంటున్నారు. న్యాయవాదిగా పనిచేసిన ఈయనకు తన వల్ల సమాజానికి కొంతైనా మేలు జరగాలన్న ఆలోచన కలిగింది. ఇందుకు లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ, గండవరపు సేతురామిరెడ్డిలే ఆదర్శమని చెబుతారు. మూడేళ్ల కిందట ఆయన తన ఆలోచన కార్యరూపమిచ్చారు. అందులో భాగంగా తన సొంతడబ్బుతో వారానికి ఒక్కసారి మూడుకట్టల సిమెంటు, కొంత కంకర, ఇసుకతో పాటు ఇద్దరు కూలీలను వెంటబెట్టుకుని రోడ్లపై పడ్డ గుంతలను పూడ్చుతున్నారు. తన భార్య సుజాతమ్మతో కలసి ప్రతినెలా ఎనిమిదోతేదీన వృద్ధులైన అయిదుగురు మహిళలకు చీరలు ఇస్తున్నారు. గత నెల 20 నుంచి ఆయన రోడ్లకు ప్యాచ్ పనులు కూడా చేయిస్తూ వస్తున్నారు. ఇక్కడ విశేషమేమంటే ఆయన వద్ద చీరలు తీసుకుంటున్న మహిళలు మేము సైతం అంటూ వచ్చి రోడ్ల పనుల్లో తమ వంతు సాయమందిస్తున్నారు. వారిలో కొందరు మహిళలు పనులు జరిగే ప్రాంతంలో చిన్న బ్యానర్ పట్టుకుని నిలబడితే మరికొందరు పనుల గురించి వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను పంచుతుంటారు.

**భూనష్టపరిహారం చెల్లించాలి**

**చిత్తూరు జిల్లా, తంబళ్ళపల్లె :** పక్కాగృహవసతి, భూనష్ట పరిహారం చెల్లింపు మొదలైన కోర్కెల సాధనకు చిన్నేరు ప్రాజెక్ట్ నిర్వాసితులు చేపట్టిన నిరసన దీక్షకు తంబళ్ళపల్లె నియోజకవర్గ లోక్‌సత్తా ఇంఛార్జి సూర్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్ కేశవమూర్తితో చర్చించారు. దీనిపై ఆయన వివరణ ఇస్తు నెలాఖరులోపు పక్కాగృహ వసతి, భూ నష్టపరిహారం చెల్లించేందుకు ఆర్డీఓ శివారెడ్డి హామీ ఇచ్చినట్టు తెలిపారు.




**మంచినీటి కోసం ధర్నా**

**అదిలాబాద్ జిల్లా, బెల్లంపల్లి :** బెల్లంపల్లి మున్సిపాలిటీ సమస్యను పరిష్కరించి, నల్లా కనెక్షన్‌కు రూ.1200 తీసుకోవాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంఛార్జి కొండబత్తిని రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల, నుండి మంద్రి, కాగజ్‌నగర్, మున్సిపాలిటీల కన్నా బెల్లంపల్లి, మున్సిపాలిటీలో నల్లా కనెక్షన్‌లకు డబ్బులు అధికంగా తీసుకుంటున్నారన్నారు. వెంటనే కనెక్షన్‌లకు రూ. 1200 తీసుకొని మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ మేరకు పంపు కనెక్షన్ డిపాజిట్లను తగ్గించాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్‌కు లోక్‌సత్తా ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు పగలు, రాత్రి తేడా లేకుండా క్యాన్లు చేతపట్టుకొని మంచినీటి కోసం తిరుగుతున్నారని లోక్‌సత్తా నాయకులు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేస్తున్న నీటి సరఫరాకు సంబంధించి పంపు కనెక్షన్ల డిపాజిట్ అధికంగా తీసుకోవడం వల్ల ప్రజలు పంపు కనెక్షన్ తీసుకోవడానికి ముందుకు రావటం లేదని వారు అన్నారు. అన్ని మున్సిపాలిటీల వల్లె బెల్లంపల్లి మున్సిపాలిటీ ప్రజలకు సమానంగా డబ్బులు వసూలు చేసి నల్లా కనెక్షన్ ఇవ్వాల్సిందిగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పి. సుకుమార్, నాయకులు మోహినుద్దీన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలు నెరవేరాలి

**అదిలాబాద్ జిల్లా, మంచిర్యాల :** తూర్పు జిల్లా లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ తూర్పు జిల్లా అధ్యక్షురాలు మేకల సరోజ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్ళాలన్నారు. అనంతరం పట్టణంలోని ఎస్‌సి బాలుర సంక్షేమ బాలుర పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే హాస్టల్‌లోని విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి టి. శ్రీనివాస్, కోశాధికారి దేవులపల్లి లక్ష్మినారాయణ, నాయకులు పాల్గొన్నారు.




## నీటిని కాపాడండి... అది మనల్ని కాపాడుతుంది

**హైదరాబాద్:** ముషీరాబాద్ నియోజకవర్గ అడిక్‌మెట్ డివిజన్ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ ప్రసిడెంట్ కౌండిన్య ప్రసాద్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ సభ్యులు తాండవకృష్ణ, చంద్రశేఖర్, లక్ష్మణవర్మ, తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా అధ్వర్యంలో...

**మెదక్ జిల్లా, శాంతినగర్, సంగారెడ్డి టౌన్ :** అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం లోక్‌సత్తా అధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి. మాధవరెడ్డి యువసత్తా జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీధర్, నాయకులు, భాస్కర్, సాయి, ఇమ్రాన్, అష్రోజ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి తొలగించాలని వినతి

**సంగారెడ్డి మున్సిపాలిటీ :** పురపాలక సంఘం పరిధిలోని డ్రైవర్స్‌కాలనీ, ఇందిరా కాలనీ మధ్య వేసిన మట్టిని తొలగించాలని కోరుతూ సోమవారం యువసత్తా జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీధర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజీర పైప్‌లైన్ కోసం సీసీ రోడ్డును తొలగించి పైప్‌లైన్ వేశారని పేర్కొన్నారు. మట్టి అక్కడే ఉంచడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డ్రైనేజీలలో మురికి నీటి పారుదలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

## సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యం

**సంగారెడ్డి రూరల్ :** సంగారెడ్డి మున్సిపాలిటీలో సమాచార హక్కు చట్టం అమలుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యువసత్తా జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆ మేరకు అప్పిలేట్ అథారిటీ అయిన మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 2004 సంవత్సరం నుంచి 2010 జనవరి వరకు మున్సిపాలిటీలలో బీఆర్‌జీఎఫ్, జేఎన్‌ఎన్‌యూ ఆర్‌ఎం ఏసీపిడీసీ నిధుల ద్వారా జరిగిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలు సమాచార హక్కు చట్టం కింద ఇవ్వాలని ఫిబ్రవరి 4న దరఖాస్తు చేశానన్నారు. కానీ, నేటి వరకు సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. అయితే, గత నెల 6వ తేదీన తిరిగి సమాచారం కోసం దరఖాస్తు చేశానన్నారు. అయినప్పటికీ తనకు అధికారులు సమాచారం ఇవ్వలేదని శ్రీధర్ ఫిర్యాదులో వివరించారు.



## వరద బాధితులకు చేయూత

**కర్నూలు టౌన్ :** స్థానిక కల్లూరు కార్పొరేషన్ పరిధిలోని వక్కెరవాగు పక్కన ఉన్న 35వ వార్డు ఈశ్వరప్ప కాలనీ వాసులకు లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితులకు సహాయం అందించింది. కిట్ల రూపములో 5 కేజీల బియ్యం, వంట పాత్రలు, చీరలు, పెట్లు, టవ్వాలు, కిట్లుగా తయారుచేసి పూర్తిగా ముంపునకు గురైన ఈశ్వరప్ప కాలనీ వాసులకు లోక్‌సత్తా పార్టీ జిల్లా కోశాధికారి ఎన్‌జీ శంకర్ అధ్వర్యంలో కిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం కార్యవర్గ సభ్యుడు హనుమంతయ్య, కార్యకర్తలు ధనుంజయ, ఏసేపు, మధు తదితరులు పాల్గొన్నారు.

**కర్నూల్ :** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వరద బాధితుల కుటుంబాలకు లోక్‌సత్తా పార్టీ కిట్లు పంపిణీ కార్యక్రమం కార్యాలయంలో నిర్వహించారు. మహాత్మజ్యోతిరావు



పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా డాక్టర్ పద్మన్న నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మన్న మాట్లాడుతూ జ్యోతిరావు పూలే చేసిన సేవలు నేడు ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. పేదల కొరకు అనునిత్యం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. వాడవాడల్లో జ్యోతిరావు పూలే జయంతిని జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నో రాత్రులు నిద్రాహారాలు మానుకొని బిసిల అభివృద్ధి కోసం నిరంతర ప్రణాళికను పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా వ్యవహరించిన జ్యోతిరావు పూలే ప్రతిఒక్కరికీ ఆదర్శం కావాలన్నారు. మరో ముఖ్య వ్యక్త శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణానికి కావాల్సిన సూచనలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు పూలే ఎన్నో వివరించారని తెలిపారు. స్త్రీ విద్యావంతురాలైతే దేశ ప్రగతి ముందుకు సాగుతుందని ఆలోచించిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. దేశ నాయకులకు ప్రతి సంవత్సరం ఒక దినం జ్యోతిరావు పూలే బాటలో నడవడానికి ప్రయత్నం చేయాలన్నారు. సమాజంలో జరుగుతున్న అసమానతలను రూపుమాపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, హనుమంతయ్య, శేషరెడ్డి, ధనుంజయ్, ఏసు, లక్ష్మన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

## నగర ఎన్నికలలో విజయం సాధిస్తాం

**నిజామాబాద్ :** రాబోయే నగరపాలిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు లోక్‌సత్తా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంఛార్జి రాష్ట్ర పరిశీలకులు కొంగర గంగాధరరావు అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని అన్ని డివిజన్లలోని సమస్యలు గుర్తించేందుకు గాను కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డివిజన్ మేనిఫెస్టోలను తయారు చేయాలని నిర్ణయించామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసేందుకు యువకులు, విద్యావంతులు, మహిళలు, మైనార్టీలు అధిక సంఖ్యలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్లెశేఖర్, రమేష్‌బాబు, నవీన్‌రెడ్డి, సత్యనారాయణ, ఆడెపు ధర్మేందర్, మహేష్ గౌడ్, వికాస్‌రెడ్డి, రాజ్‌భరత్, నవీన్‌కుమార్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## కళాశాల అభివృద్ధి కృషి చేయాలి

**నెల్లూరు జిల్లా, గూడూరు :** స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజా సంఘాల నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జేకేసీలో ఉచితంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలకు ప్రహరీల ఏర్పాట్లు చేసి ప్రైవేటు కళాశాలలకు దీటుగా వసతులు కల్పించాలన్నారు. శిథిలావస్థకు చేరిన గదుల స్థానంలో నూతనంగా నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా కన్వీనర్ కె.వి.కృష్ణయ్య, బీఎస్పీ నాయకులు భాస్కర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య ఎమ్మార్పీయస్ నాయకులు మందా కృష్ణయ్య, మైనార్టీ సంఘం నాయకులు ఫజుల్, బీసిఎస్ఎఫ్ నాయకుడు చెంచయ్య, మైనార్టీ నాయకుడు మస్తాన్‌బాషా, ఎల్.వి.సుబ్బయ్య భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీలకు వణుకు పుట్టించే పోలీసు అధికారులు రావాలి

**గుంటూరు జిల్లా, నరసరావుపేట** : రౌడీలకు, అసాంఘీక శక్తులకు వణుకు పుట్టించగల పోలీసు అధికారులు ఉన్నప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని ప్రజా సంఘాలు అభిప్రాయపడ్డాయి. 'నేటి విద్యార్థులు - నేర ప్రవృత్తి' అనే అంశంపై స్థానిక లోక్‌సత్తా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి లోక్‌సత్తా అధ్యక్షులు ఈదర గోపిచంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్య వ్యతిరేక ఐక్యవేదిక నాయకులు వేళ్ళచెరువు వీరాంజనేయులు మాట్లాడుతూ, 20 వేల మంది విద్యార్థులు పట్టణ, పరిసర ప్రాంత కళాశాలల్లో చదువుతున్నారన్నారు.

నేటి సినీ, టీవీ, నెట్ దుష్ప్రభావానికి వీరు గురై నాగరికత పేరున మద్య పానానికి, అశ్లీల, హింసాత్మక సినిమాలు చూసేందుకు అలవాటుపడి మానవత్వం కోల్పోయి, నైతిక

విలువలు సైతం కోల్పోయారన్నారు. దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు దరియావలి మాట్లాడుతూ, దేశమంతటా సామ్రాజ్య వాద విష సంస్కృతి రాజ్యమేలుతుందని, దేశభక్తికి, నైతిక విలువలకు స్థానం కరువైందన్నారు. తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు అందరిలో ర్యాంక్‌లు, ప్లేస్‌మెంట్లపై దృష్టి తప్ప సామాజిక బాధ్యత కొరవడిందని విచారం వ్యక్తం చేసారు.

జైభారత్ రాష్ట్ర కమిటీ సభ్యులు కరణం సుబ్బారావు మాట్లాడుతూ, కళాశాల్లో కేవలం పాఠ్యాంశాల బోధనే కాక సామాజిక సమస్యలపై చర్చలు జరిపించి, విద్యార్థుల్లో చైతన్యం కల్పించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వ్యతిరేక సదస్సులు జరగటం లేదని ఆళ్ళ సుబ్బారెడ్డి ఆరోపించారు. రౌడీషీట్స్ తెరచి, వారికి తరచూ కౌన్సిలింగ్ ఇస్తూ మార్పు తెప్పించాలని, నేరస్తుల యెడల కఠిన వైఖరి పోలీసులు అవలంభించాలే తప్ప సెటిల్‌మెంట్స్ చేసి అవినీతికి పాల్పడటం తగదని పోతురాజు అన్నారు. త్వరలోనే ఆర్డీఓ, డిఎస్‌పిలను కలసి తమ ఆందోళనను తెలపాలని, కళాశాలలను కూడా సందర్శించాలని సందర్భంగా వారు తీర్మానించారు.

లక్షలాది మంది మహిళల పిల్లల జీవితాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఈ క్రింది చర్యలు చేపట్టవలసినదిగా ప్రభుత్వాన్ని కోరారు.

1. జిల్లాలో బెల్టు షాపుల్ని నిషేధించి తక్షణమే వాటిని మూసివేయించాలి.
2. గుడుంబా, నాటుసారాని పూర్తిగా నిరోధించాలి స్థానిక ప్రభుత్వాలకి మహిళా సంఘాలకి, డ్వాక్రా సంఘాల సమాఖ్యలకి అక్రమ సారాయిని అదుపుచేసే అధికారాలు ఇవ్వాలి.
3. లైసెన్సు ఉన్న మద్యం దుకాణాల దగ్గర బహిరంగ మద్యపానాన్ని నిషేధించాలి.
4. జాతీయరహదారులపై ఉన్న మద్యం షాపులు మూసివేయాలి.
5. మహిళలపై జరిగే అత్యాచారాలు, నేరాలు, వేదింపులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
6. పోలీసు, న్యాయసంస్కరణలను వెంటనే చేపట్టాలి.
7. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను, మహిళాకోర్టులను ప్రతిజిల్లాలో ఏర్పాటు చేయాలి.
8. మహిళలు పిల్లలపై దురాగతాలకు సంబంధించిన శిక్షను మూడు నెలలలోపు అమలుపరచాలి.
9. గ్రామాలలో న్యాయాలయాలు ఏర్పాటు చేసి సత్వరన్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.
10. అధికారాన్ని వికేంద్రీకరించి, కమ్యూనిటీ లివింగ్ వార్డు ప్రభుత్వాలకి అధికారాలు ఇవ్వాలి. ఈ వినతులపై జిల్లా ప్రభుత్వ బాధ్యతగల అధికారులు వెంటనే స్పందించాలి.



**ప్రకాశం జిల్లా, దర్శి :** డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని దర్శి పట్టణాలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, కార్యకర్తలతో గ్రామంలోని అంబేద్కర్ ఆశయాల పట్ల అవగాహనా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇందులో దర్శి ఇంఛార్జి మంచినేని శ్రీనివాసరావు గడ్డి శ్రీనివాసరావు, వెంకటరావులు తదితరులు పాల్గొన్నారు.



**హైదరాబాద్, మలక్‌పేట్ :** భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాలను లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో మలక్‌పేటలో ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ యువసత్తా ఇంఛార్జి దోనపాటి రాము నేతలు బాబూరావు, కిరణ్, కిశోర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ జయంతి సందర్భంగా రాజమండ్రి లోక్‌సత్తా వారిచే అనాథబాలలకు పండ్లు, మిఠాయిలు పంచుతున్న అధ్యక్షురాలు మరియు కార్యకర్తలు. ఈ కార్యక్రమంలో బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి గురించి వక్తలు ప్రసంగించారు.



జనగణమన గీతాన్ని జాతీయగీతంగా ఆమోదించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అనాథబాలలకు బియ్యాన్ని పంపిణీ చేసిన లోక్‌సత్తా పార్టీ రాజమండ్రి అధ్యక్షులు ఆర్. చంద్రకళ, రాజమండ్రి అర్బన్ అధ్యక్షులు డా॥ వి.వి. రామారావు. ఈ సందర్భంగా వారు స్కూలు విద్యార్థులకు జాతీయగీత విశిష్టతను గూర్చి వివరించారు.

**సూళ్ళూరుపేట ఆర్.టి.ఓ ఆఫీసులో సమస్యలు :**

1. ఏజెంట్లు లేనిదే పనిజరగదు కాని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎల్ఎల్ఆర్ గాని Driving licence కోసం గాని ఎవరైనా వస్తే సంబంధింత అధికారి Forms ఇచ్చి, ఆ Forms పూర్తి చేయడంతో సహకరించాలి. Form లేవనే సమాధానం వస్తుంది. Agent దగ్గర మాత్రం Forms విరివిగా వుంటాయి. Agent లేకుండా ఎవరైనా వస్తే వాళ్ళని మామూళ్ళ కోసం వేధించడం, ఇవ్వకపోతే పనిని వాయిదా వేయడం.
2. ఆఫీస్ బయట Traffic signal ఒక విధంగా లోపల వేరే symbols చూపిస్తూ అభ్యర్థులను ప్రశ్నించడం.
3. సిటిజన్ ఛార్టర్స్ అమలు చేయకపోవడం.
4. ఆర్.టి.ఐ చట్టాన్ని అమలు చేయకపోవడం.
5. Direct గా వచ్చిన వాళ్ళను కఠిన ప్రశ్నలకు గురి చేయడం Agent ద్వారా వచ్చిన వాళ్ళకి ఒక్కోసారి పరీక్షలే నిర్వహించకపోవడం.

లోక్‌సత్తా పార్టీ తరపున ఈ సమస్యలని సూళ్ళురుపేట Motor vehicle Inspector కి నివేదించటం నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కరించనట్లయితే పై అధికారులకు తెలియపరుస్తామని చెప్పటం ఆయన స్పందించి వెంటనే తగిన చర్యలు చేపడతామని హామీ ఇవ్వడం జరిగింది.

**– వి.దినకర్ రెడ్డి,**
సూళ్ళూరుపేట, నెల్లూరు జిల్లా

**ప్రజాస్వామ్యంలో హింసకు తావే లేదు : జేపీ**

## దంతెవాడ ఘటనపై లోక్‌సత్తా తీవ్ర దిగ్భ్రాంతి

ఛత్తీస్‌గఢ్ దంతెవాడలో తీవ్రవాదుల మందుపాతరలో పెద్దసంఖ్యలో మన జవాన్లు మరణించడం, అనేకమంది గాయపడడం తీవ్ర దిగ్భ్రాంతికరం. ప్రజాస్వామ్యంలో చర్చల ద్వారా పరిష్కారాలు సాధించుకోవాల్సిందేతప్ప హింసకు తావుండదు. పరిష్కారం దొరకని సమస్యేదైనా వుంటే దానిని ఓటు ద్వారా ప్రజాబ్యాలెట్‌లోనే తేల్చుకోవాలనేదే లోక్‌సత్తా వైఖరి. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో తరచూ ఇటువంటి హింసాత్మక ఘటనలు ఎదురుకావడానికి కారణం రాష్ట్రప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య సంబంధాలు తెగిపోవడమే. అధికారాన్ని కేంద్రీకృతం చేసి తమ చెప్పుచేతల్లో వుంచుకోవడం ద్వారా ముఖ్యమంత్రులు నిరంకుశులుగా వ్యవహరిస్తున్నారు. వికేంద్రీకరణ ద్వారా అధికారాలు, వనరులు ప్రజల చేతుల్లోనే వుండేలా పరిపాలనలో మూడో అంకం ప్రారంభం కావల్సిన తరుణమిదే. లేకపోతే పౌరులు ప్రభుత్వానికి దూరమై హింస పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణ రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా గుర్తించాలి. రాష్ట్రాల బాధ్యతను రాష్ట్రప్రభుత్వాలమీదనే వదిలిపెట్టి, కేంద్రం రాష్ట్రాలకు అవసరమైన వనరులు, సిబ్బంది, నైపుణ్యాలను అందించడం ద్వారా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

### సూచన

**మీ జిల్లాలో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని తప్పనిసరిగా ఫొటోలతో పాటు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించండి. వీలువెంబడి వాటిని వరుసగా ప్రచురిస్తాం. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.**

### వివిధ అంశాలపై మీరడిగే ప్రశ్నలకు

**డా॥ జేపీ సమాధానాలిస్తారు.**

**ప్రచురించబడిన**

**ప్రతి ప్రశ్నకు రూ॥ 100/-**

**పారితోషికం ఇవ్వబడును**



## లీజు పేరుతో మరో దోపిడీకి సిద్ధం

**విజయనగరం, జామి :** ప్రభుత్వ సహకార చక్కెర కర్మాగారాలను లీజు పేరుతో మరో దోపిడీకి అవకాశం ఇస్తోందని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. భీమసింగి చక్కెర కర్మాగారం అతిథి గృహంలో కర్మాగార కార్మిక నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కర్మాగారం రైతుల సంక్షేమ కోసం ఏర్పడిందని దీనిని ప్రైవేటుపరం చెయ్యడం సమంజసం కాదని అన్నారు. ఇటువంటి ప్రజావ్యతిరేక చర్యలపై పోరాటానికి రైతుల వద్దకు వెళ్లి వారిని చైతన్యం చేస్తామన్నారు. అంతేకాక తప్పనిసరిగా అమ్మాలని భావిస్తే రైతులకు అమ్మాలని డిమాండ్ చేశారు. ఇపుడు లీజుకు అని చెప్పి కొంతకాలానికి అమ్మేయడం ఖాయమని అన్నారు. ప్రభుత్వానికి చేతకాకపోతే విశాఖడెయిరీకి అప్పగించాలన్నారు. ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం నాయకులైన ఏఐటియుసి నేతలు గోపాలరాజు, లగుడుసత్యం, మీసాల కృష్ణలు మాట్లాడుతూ ఫ్యాక్టరీని ప్రయివేటు పరం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ ఏడాది ప్రభుత్వం పై ఆధారపడకుండా క్రషింగ్ ను జరపామన్నారు. గత మూడు సంవత్సరాలుగా లాభాల బాటలో నడుస్తున్న కర్మాగారాన్ని ఎందుకు లీజుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. భీమసింగి మహాజన సభ వెంటనే నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని డిమాండు చేశారు. రైతుల షేరు ధనంతో నడుస్తున్న ఈ కర్మాగారాన్ని రైతులకే అప్పగించాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో భీమసింగి పరిధిలో అన్ని గ్రామాలు పర్యటించి రైతుల మద్ధతు కోరుతామని తెలిపారు. 1982 అనంతరం అపిట్కో సంస్థ లేదని, ఇప్పుడు ఆ సంస్థ పేరుతో సర్వే చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

## ప్రభుత్వ పథకాలపై పరిశీలన అవసరం

**విజయనగరం :** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలపై పూర్తిస్థాయి పరిశీలన అవసరం ఎంతైనా ఉందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టిబాబ్జీ అన్నారు. ఈ మేరకు డ్వామా పి.డి. బి.గోపాలకృష్ణ కలిసి పథకాన్ని విజయపథంలో నడిపిస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ పథకం అమలులో జిల్లా కు ప్రథమస్థానం వచ్చి ఉపాధి హామి పథకం అమల్లో



విజయనగరం జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమైనదని పథకం అమలుపై అనేక ఆరోపణలు వస్తున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిశీలించాలని కోరారు. పథకం పేదలకోసం ప్రవేశపెట్టినప్పటికీ రాజకీయనాయకులు తప్పదోవ పట్టిస్తూ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ రోడ్ల నిర్మాణంలో పథకం దుర్వినియోగాన్ని తగ్గించాలని కోరారు. పి.డి.ని కలిసిన వారిలో పార్టీ నాయకులు లక్కరాజు శివరామారావు, ఎస్.చందరరావు, దయానంద్, వెంకటరావుయాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ పథకానికి గుర్తింపు రావడం వెనుక సిబ్బంది కృషితోపాటు, జిల్లాస్థాయి అధికారుల పనితీరు కారణమన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ జాతీయ సలహా మండల సభ్యుడిగా ఉపాధి హామీ పథకానికి రూపకల్పన చేశారన్నారు. ఈ పథకం ప్రజల అవసరాలు తీర్చడం కోసం, ప్రజలను వలసకు దూరంగా ఉంచడం కోసం ఉ పయోగపడుతోందని చెప్పారు.

## బెల్టుషాపులను మూసివేయాలి

**చీపురుపల్లి :** అన్ని ప్రాంతాల్లో బెల్టుషాపులను మూయించేందుకు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి రెడ్డి లక్ష్మునాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పట్టణ పరిధిలో గల వంగపల్లిపేటలో బెల్టుషాపును మూయించేందుకు జిల్లా పరిషత్ ఛైర్మన్ బెల్లాన చంద్రశేఖర్ తీసుకున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. తమ గ్రామంలో బెల్టుషాపును మూయించాలని ప్రజలు కోరిన తక్షణమే ఆయన స్పందించడం పట్ల లోక్‌సత్తా పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో వంగపల్లిపేట, చీపురుపల్లి తదితర ప్రాంతాలలో ఉన్న బెల్టుషాపులను లైసెన్స్ లేకుండా నడుపుతున్న కల్లు, మద్యం దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకుంటే అందరూ హర్షిస్తారని పేర్కొన్నారు. ప్రజా జీవితాలతో చెలగాటమాడుతున్న ఇటువంటి బెల్టు దుకాణాలను తక్షణమే మూసివేసే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. మిగతా చోట్ల కూడా ఇటువంటి

దుకాణాలను మూయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయనతో పాటు యువసత్తా జిల్లా ఉపాధ్యక్షుడు రేగిడి దాలినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జమ్ము నాగేశ్వర రావు, కొక్కెర సత్యారావు, రేడిగి రామకృష్ణ తదితరులు కోరారు.



## ప్రజాబ్యాలెట్‌కు విశేష స్పందన

**బొబ్బిలి :** లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజాబ్యాలెట్ కార్యక్రమానికి విశేషస్పందన లభించింది. ఈ మేరకు స్థానిక తిరుమల ప్రెస్ ఆవరణలో ఆ పార్టీ నాయకులు బ్యాలెట్‌బాక్సును ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పనితీరుపై అభిప్రాయాలు తెలియజేసేందుకు బ్యాలెట్ పేపర్లు పంపిణీ చేశారు. ఈ బ్యాలెట్‌పై రెండు బాక్సులు ఏర్పాటు చేసి బాగుంది, బాగులేదు అనే అంశాలను పొందుపరిచారు. ప్రజలు తమ అభిప్రాయాన్ని ఏదో ఒక బాక్సులో స్టాంపు ద్వారా తెలియజేసి ఆ పత్రాన్ని బాక్సులో వేయాలి. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించినట్లు ఈ ఓటింగ్‌లో మున్సిపాలిటీ పరిపాలన బాగుందని ప్రజలు తీర్పునిచ్చినట్టు లోక్‌సత్తా పార్టీ నాయకులు వేమురెడ్డి లక్ష్మంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కప్పగంగరాజు, వేమురెడ్డి లక్ష్మంనాయుడు, ఆకుల దామోదరరావు, కంకణాల సూరిబాబు, బంటు అర్జునరావు, జామి భాస్కరరావు తదితరులు కమిషనర్ ప్రసాద్‌ను కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందించారు.

## సమస్యలపై దృష్టి సారించండి

**బొబ్బిలి :** పట్టణ, మండలాల్లో నెలకొన్న సమస్యలను పార్టీ దృష్టికి అధికారుల దృష్టికి తీసుకురావాలని లోక్‌సత్తా యువసత్తా నాయకులు కె. సూరిబాబు తెలిపారు. స్థానిక లక్ష్మి రెసిడెన్సిలో పట్టణ మరియు మండలాల నుండి వచ్చిన లోక్‌సత్తా కార్యకర్తలు అభిమానులతో సమావేశం నిర్వహించారు. పట్టణం, మండలంలో త్రాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తక్షణం వాటి నివారణకు చర్యలు తీసుకోవడానికి కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని చెప్పారు.

## ప్రజాహిత కార్యక్రమాలు చేయాలి

**విజయనగరం, కంటోన్మెంట్ :** జనహితం కోసం ప్రజానేత బాబూ జగ్జీవన్‌రామ్ తన జీవితాన్ని దేశానికి అంకితం చేశారని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. సోమవారం జగ్జీవన్‌రామ్ 103వ జయంతి సందర్భంగా 14వ వార్డు లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి పురోహిత్‌రాజు, కార్యకర్తలు స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఇలాంటి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని కార్యక్రమాలు కార్యకర్తలను అభినందించారు.

కాంప్లెక్స్ ఆవరణలో చలివేంద్రం అసవరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. చలివేంద్రాలు ఏర్పాటుచేస్తున్న వారికి పట్టణ మున్సిపాల్టీ అధికారులు నీరు సరఫరా చేస్తే బాగుంటుందని ఆయన కోరారు. కాస్తున్న ఎండను దృష్టిలో పెట్టుకుని ఇటువంటి చలివేంద్రాలు పట్టణంలో మరిన్ని ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంఘాలు ముందుకు రావాలన్నారు.

సేవ చేయాలన్న దృక్పధాన్ని అలవర్చుకోవాలని అందుకు దేశం కోసం త్యాగాలు చేసిన నాయకులను మననం చేసుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం ఎండలు మండే గోళాన్ని తలపిస్తూ పాదచారులను, ఇతర ప్రజలను తీవ్ర అవస్థలకు గురి చేస్తున్నాయని వారి సాంత్వన చేకూర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రతినిధి ఎంఎస్ఎన్ రాజు, యువసత్తా జిల్లా అధ్యక్షుడు పొంద్రంకి వెంకటరమణ, కార్యదర్శి దయానంద్, పార్టీ ప్రతినిధులు చంద్రరావు, ఎ.పి. అశ్వనీ కుమార్, ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## పేరు మార్పుతో రాష్ట్రం అభివృద్ధి జరగదు

**విజయనగరం, మయూరికూడలి :** రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర విభజన ఒక్కటే సర్వరోగ నివారిణి కాదని, పరిపాలనలో మార్పులు లేకుండా కేవలం ప్రాంతాల పేర్లు మార్చినంత మాత్రాన అనుకున్న అభివృద్ధి సాధ్యం కాదన్న

విషయాన్ని లోక్‌సత్తా పార్టీ స్పష్టం చేస్తూ డాక్టర్ జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో నివేదికను జస్టిస్ శ్రీకృష్ణా కమిటీకి అందజేయడం జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి అప్పారావు, బాబ్జీ తెలిపారు. పరిపాలనలో మౌలిక మార్పులు లేకుండా కేవలం రాష్ట్ర పేరు సరిహద్దులు రాజధాని మార్చటం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. హేతుబద్ధ విశ్లేషణకు, సమస్య శాశ్వతంగా పరిష్కరించే కోణానికే నివేదికలో ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాటాడుతూ ఓట్లకోసం ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాంతాల మధ్య విభేదాలకు ఆజ్యం పోసి సినిమా చూస్తుంటే, లోక్‌సత్తా మాత్రం ఉన్న విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా కమిటీకి వివరించడం జరిగిందని ఇది ఒక్క లోక్‌సత్తా పార్టీకే సాధ్యమని అన్నారు. ప్రధాన పార్టీల నాయకులు ప్రాంతానికో మాటతో తప్పించుకుని తిరుగుతున్నారని విమర్శించారు. లోక్‌సత్తా పార్టీ మాత్రం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఒకే నివేదికను అందించడం జరిగిందని పునరుద్ఘాటించారు. లోక్‌సత్తా పార్టీ అధినేత డా॥ జయప్రకాష్ నారాయణ దమ్మున్న నాయుకుడిగా నిరూపించుకున్నారని అన్నారు. పార్టీ ఇచ్చిన నివేదికలోని కొన్ని ముఖ్య అంశాలను ఆయన ఈ విధంగా వివరించారు. ఈ నివేదికలో హేతుబద్ధ విశ్లేషణకు సమస్య శాశ్వతంగా పరిష్కరించే కోణానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. ఆంధ్రా, తెలంగాణలోని ఇతర వెనుకబడిన ప్రాంతాల సమస్యలను పరిష్కరించేందుకు 7 అంశాలను కమిటీకి సూచించామన్నారు. ఆర్టికల్ 371(1) ప్రకారం ప్రాంతీయకౌన్సిళ్లను పునఃప్రారంభించడం పూర్తి అధికారాలున్న జిల్లా కౌన్సిళ్లను ఏర్పాటు 1975 నాటి ఆరుసూత్రాల విధానం, నదీజలాల పంపకాల్లో చట్టబద్ధ ట్రిబ్యునల్ ఉండాలని, అదే విధంగా ప్రతి జిల్లాకు అంబుడ్స్‌మన్స్ ఏర్పాటు చేయడంతో పాటు ర్యాపిడ్ గ్రోత్ కారిడార్లను ఏర్పాటు చేయాలని అందులో విద్య, వ్యవసాయ పారిశ్రామిక జోన్లను కలపాలడంవంటి పలు అంశాలను పొందుపరచడం జరిగిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు భిన్నంగా ఉన్నది ఉన్నట్టుగా సమస్యను వివరిస్తు నివేదికను ఇవ్వడంతో పార్టీ అధినేత డా॥ జయప్రకాష్ నారాయణ విజయం సాధించారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సమావేశంలో పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ ఐ. అనంతలక్ష్మి, జిల్లా నాయకులు ఎం.ఎస్.ఎన్ రాజు, లక్కరాజు శివరామారావు, యువసత్తా నాయకులు పి.వి.రమణ, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

**జామిలో....**

మండల కేంద్రమైన జామిలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో డా॥ బాబూజగజ్జీవన్ 103 జయంతి ఘనంగా జరిగింది. శృంగవరపుకోట నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ నాయకుడు పీ. ప్రతాపవర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జగజ్జీవన్ సామాజిక న్యాయం, దళితుల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువసత్తా నాయకులు కె. రమేష్, మిడతాన అప్పారావు, లోక్‌సత్తా పార్టీ జిల్లా లీగల్ సెల్ సభ్యులు మంతెన అప్పారావు తదితరులు జగజ్జీవన్ చేసిన కృషి తెలియజేశారు.

## బాధితురాలికి లోక్‌సత్తా ఆర్థిక సాయం

**విజయనగరం :** హత్యాయత్నానికి గురైన పైడిరాజు కుటుంబానికి లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా లోక్‌సత్తా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ 10 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పెట్టిన ప్రజాపథంలోని ప్రజలు సమస్యలను ఎలా పరిష్కరిస్తారో అలాగే ఇటువంటి వారికి న్యాయం జరిగేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, ఇంతటి అఘయిత్యానికి పాల్పడిన వారిని తీవ్రంగా శిక్షించాలని గవర్నర్ దృష్టికి తీసుకుని వెళతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎన్ఎస్ రాజు పలు మహిళాసంఘం నాయకులు పాల్గొన్నారు.

## యాసిడ్ దాడులు నిరోధించండి

**గుంటూరు:** స్థానిక కలెక్టర్ కార్యాలయంలో లోక్‌సత్తా జిల్లా నాయకులు కలెక్టర్ బి.రామంజనేయులును కలిసి యాసిడ్‌దాడులు నిరోధించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి మాట్లాడుతూ లలితాబాయి కుటుంబానికి రూ॥10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, మేథావులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులను సమావేశ పరిచి చైతన్య సదస్సులు నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో పన్ను చెల్లింపుదారుల సంఘం అధ్యక్షులు పరంధామయ్య, అంజిరెడ్డి, గుప్తా, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : లోక్‌సత్తా

**గుంటూరు:** నిరుపేద రోగుల కోసం, ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ధర్మాసుపత్రులను ఏర్పాటు చేశారని కాని అటువంటి ఆసుపత్రుల్లో రోగులకు క్షతగాత్రులకు వైద్య సేవలు అందించటంతో డాక్టర్లు నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని, సక్రమమైన వైద్యం అందించాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫణిభూషణ్‌ను కోరారు. వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామ సమీపంలో లారీ బోల్తాపడి తీవ్రంగా గాయపడి జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను లోక్‌సత్తా పార్టీ జిల్లా, నగర నాయకులు

పరామర్శించారు. ఈ సందర్శంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నారాయణ రెడ్డి మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతి చెందిన వారికి రూ॥5లక్షలు, గాయపడిన వారికి రూ॥లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదాలు అధికారుల నిర్లక్ష్యం కారాణంగానే చోటు చేసుకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కూడా లారీలలో ప్రయాణించకుండా బస్సులను ఆశ్రయించాలని కోరారు. పరామర్శించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వరరావు, మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు పద్మారాణి నగర అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, పార్టీ నగర అధక్షుడు శరత్‌కుమార్, యువి సత్యనారాయణ అరవింద్, శ్రీదేవి తదితరులున్నారు.

## ప్రజలను చైతన్య పరచేందుకే 'సర్వజన సత్తా'

**గుంటూరు:** రాజ్యాంగం రూపొంది 60 సంవత్సరాలు గడుసున్నా నేటివరకు హక్కులు, సదుపాయాలపై ప్రజలకు చైతన్యపరచేందుకు సర్వజన సత్తా నడుం బిగించిందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఈద చెన్నయ్య స్పష్టం చేశారు. లోక్‌సత్తా పార్టీ అనుబంధ సంస్థ అయిన సర్వజన సత్తా నాయకులు గుంటూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చెన్నయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, సదుపాయాలను తెలియజేసేందుకు సర్వజన సత్తా ఏర్పాటైందని తెలిపారు. దీనిని ఫిబ్రవరిలో ప్రారంభించామన్నారు. అధికారంలో ఉన్న పార్టీ, గతంలో పాలించిన పార్టీలు ప్రజలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని ఆరోపించారు. తమ పార్టీ నాయకులందరూ ఇప్పటికి 12 జిల్లాల్లో పర్యటించి రాజ్యాంగ హక్కుల గురించి ప్రజలకు సంక్షిప్తంగా తెలియజేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వ అణచివేత ధోరణిని దృష్టిలో ఉంచుకొని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ సర్వజన సత్తాను రూపొందించారన్నారు.

సమావేశంలో సర్వజనసత్తా రాష్ట్ర నాయకులు ఎ. రాఘవయ్య, ఓంకార్, ఎస్‌కె. రఫీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి శివ నాగేశ్వరరావు, నగర అధ్యక్షులు శరత్ బాబు, సాంబయ్య, కృపాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుపై వడ్డీ రద్దు హర్షణీయం

**గుంటూరు:** లోక్‌సత్తా ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కృషి ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్నుపై వడ్డీని రద్దు చేసిందని లోక్‌సత్తా నారాయణ రెడ్డి తెలిపారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలను తీసుకొని ముందు వ్యతిరేక నిర్ణయాలను తీసుకొనే ముందు యంత్రాంగం ఒకటికి రెండుసార్లు పునఃసమీక్షించుకోవాలని సూచించారు.



## అత్యాచారానికి గురైన బాలికకు జేపీ పరామర్శ

**హైదరాబాద్ :** అత్యాచారానికి గురైన గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను లోక్‌సత్తా పార్టీ అధినేత, ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ పరామర్శించారు. మార్చి 31 అర్ధరాత్రి బోరబండలో గుర్తు తెలియని దుండగుల చేతుల్లో ఓ బాలిక అత్యాచారానికి గురైంది. ఈ ఘటనలో అడ్డు వచ్చిన ఆమె సోదరులపై ఆగంతకులు దాడిచేసి గాయపరచి పరారైన విషయం విదితమే. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని, ఆమె సోదరులను జేపీ ఓదార్చారు. తనవంతు సహాయంగా రూ.25వేల చెక్కును బాలిక తల్లికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితురాలిని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఇటువంటి సంఘటనలు జరగడం దారుణమని, ప్రస్తుతం బాలిక చావుబతుకుల మధ్య ఉందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. పలుకుబడి ఉన్నవారి కూతుళ్ల విషయంలో ఎలా స్పందిస్తారో.. ఈ బాలిక విషయంలోనూ అదేలా చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ బాలకోటికి సూచించారు. డీఎన్ఏ పరీక్షలు చేయించాలని, దాని తాలుకు రిపోర్టులుంటే నిందితులను ఎప్పటికైనా పట్టుకుని శిక్షించే వీలుంటుందని చెప్పారు. బాలిక కళ్లు తెరిచి చూస్తుంది తప్పితే ఇంకా ఎవరినీ గుర్తు పట్టడం లేదని, మెల్లగా కోలుకుంటుందని న్యూరోసర్జన్ శరత్ వివరించారు. కార్యక్రమంలో బాలానగర్ డిప్యూటీ తహశీల్దార్ వనజాదేవి, లోక్‌సత్తా మహిళా నాయకులు సింధూ కళ్యాణి, మణిమంజరి, గజానని, పద్మజారాణి, శైలజ, జేపీ వెంట ఉన్నారు. ▣

**నేర్చుకోడానికి ఇష్టపడకుండా ఉండటం కంటే, ఏ విషయాలనైనా తెలుసుకోకపోవడం అన్నది మరీ అవమానకరమైన విషయం కాదు** – రూత్ మెక్రీ

## సమాచార హక్కు చట్టంతో...

# ప్రభుత్వ రికార్డులను మనం తనిఖీ చేయవచ్చు

మీ కెప్పుడైనా ప్రభుత్వ రికార్డులని తనిఖీ చేయాలని అనిపించిందా? మేము ఆ పని చేసాం. ఆ ఆలోచనే మమ్మల్ని (అవినీతిపై మరో యుద్ధానికి) పూర్తి సన్నద్ధుల్ని చేసింది. అందుకు మేము వాడిన ఆయుధం సమాచారహక్కు చట్టం.

**విషయం : ప్రభుత్వ కార్యాలయాలలోని రికార్డులను తనిఖీ చేయడం**

**తేది: 20 మార్చి 2010 మరియు 13 ఏప్రిల్ 2010**

**సందర్శించిన కార్యాలయాలు**

1. ఇరిగేషన్ 4 కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సచివాలయము(13-4-2010న)
2. శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం, చెరువుగట్టు గ్రామం, నార్కట్‌పల్లి మండలం, నల్గొండ జిల్లా (20-3-2010న)

**వాడిన సెక్షన్ మరియు వివరాలు :**

- RTI act 2005, సెక్షన్ 2 (J) (1) ప్రకారం ప్రతీ వ్యక్తికి ప్రభుత్వ సంస్థల రికార్డులను తనిఖీ చేసే అధికారం వుంది.
- RTI చట్టం 2005, సెక్షన్ 2 (J) (11) ప్రకారం కావల్సిన రసీదులకు సంబంధించిన నకలు కాపీలు తీసుకునే హక్కు వుంది.
- VAT చట్టం 2005, సెక్షన్ 17 ప్రకారం రూ॥5 లక్షలు టర్నోవర్ దాటిన ప్రతీ షాపు యజమాని TOT లేదా VAT డీలర్ తప్పనిసరిగా రిజిష్టర్ కావాలి మరియు ప్రతీ మూడు నెలలకు పన్నులు కట్టాలి.
- TOT (Turnover Tax) లేదా TIN (Tax Identification Number) సంఖ్యను తప్పనిసరిగా ప్రతీ బిల్లుపై ముద్రించాలి.

కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్ గురించి మరింత సమాచారం కొరకు https: //apcommercialtaxes.gov.in) వెబ్‌సైట్ చూడవచ్చు.

**విధానము: ప్రభుత్వ రికార్డులు తనిఖీ చేయదలచుకున్న ఎవరైనా**

1. మనం తనిఖీ చేయదలచుకున్న ప్రభుత్వ విభాగం / సంస్థలకు ఆర్‌టిఐ చట్టం క్రింద దరఖాస్తు చేయాలి. (మేము చేసిన దరఖాస్తులు చూడండి. అనుబంధం 1, 2)
2. ఆయా ప్రభుత్వ విభాగాలకు/సంస్థలకు వీలు అయిన నిర్దేశిత సమయాన్ని మనకు రికార్డుల తనిఖీకి కేటాయిస్తారు. (మాకు అందిన సమాచారం చూడగలరు. అనుబంధం 3, 4)



**చేపట్టిన కార్యక్రమాలు**

1. 2005-06 మరియు 2006-07కి ఆర్థిక సంవత్సరాలకి డబ్బు ఖర్చులకి చెందిన బిల్సు తనిఖీ చేయడం జరిగింది.

2. 20-12-2009 నుండి 31-12-20009 మధ్య స్టేషనరీ మరియు ఇతరాలపై ఖర్చులకి సంబంధించిన బిల్స్ తనిఖీ చేయడం జరిగింది.

3. బిల్లులు Valid ToT లేదా VAT డీలర్ల ద్వారా జరిగినవా లేదా అని చూడటం జరిగింది. (ఒక్క బిల్లు పై కూడా ToT లేదా VAT సంఖ్య లేదు. అంటూ లక్షల్లో జరిగిన ఈ కొనుగోళ్ళు లావాదేవీల పై పన్ను కట్టబడలేదు. దీనిపై Commercial Tax Department కు ఫిర్యాదు చేయబోతున్నాం.

**ఉపయోగాలు**

● లక్షల కొద్ది కమర్షియల్ పన్ను ఆదాయం ఎగ్గొడుతున్న చట్టవ్యతిరేక వ్యాపారస్థులను పట్టుకోవచ్చు. ● ప్రభుత్వ సొమ్ము వివిధ సంస్థల ద్వారా ఏ రకంగా ఖర్చు చేయబడుతుందో చూడవచ్చు. ● ఏదైనా ప్రభుత్వ సంస్థ అవినీతిమయంగా తేలితే ఫిర్యాదు చేయవచ్చు. తద్వారా అవినీతిని నియంత్రించవచ్చు. ● ప్రభుత్వ సంస్థలు మరింత బాధ్యతాయుతంగా వుంటాయి. బాధ్యత గల పౌరులు ఈ తనిఖీలని చేపట్టినట్లయితే ప్రభుత్వ ఉద్యోగులు మరింత జాగరూకులై వుంటారు. ● ఒక్కమాటలో ''మరింత క్రమశిక్షణతో, పారదర్శకంగా అవినీతి లేని సమాజం'' ఏర్పడుతుంది. ● **ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు: గంజి శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ అజీజ్, సుబ్రమణ్యం, ప్రవీణ్ మరియు కిరణ్**

Photoes link : http: pikasaweb.google.com/loksatta

# అనుబంధం - 1

Top Priority

**సమాచారం కోసం దరఖాస్తు**
(సమాచార హక్కు చట్టం 2005)

Top Priority

NO: 23
తేది: 03-02-2010

ప్రజా సమాచార అధికారి,
సంయుక్త కార్యదర్శి కార్యాలయం,
ఐ&సీఏడీ (IW:OP) డిపార్ట్‌మెంట్,
సచివాలయం, హైదరాబాద్.




ప్రజా సమాచార అధికారి గారికి,

సమాచార హక్కు చట్టం 2005, సెక్షన్ 6(1) ప్రకారం కింది విషయాలకు సమాచారాన్ని సెక్షన్ 7(1) ప్రకారం వీలైనంత త్వరగా లేదా 30 రోజుల్లో సెక్షన్ 2 (జె)(ii), (iii) ప్రకారం రికార్డుల తనిఖీకి, వీడియో రికార్డర్ ద్వారా, (కేంద్ర సమాచార కమిషన్, న్యూఢిల్లీ వారి ఆదేశం CIC/WB/A/2006/00144, dated: 20-03-2006) స్టిల్ కెమేరా ద్వారా బిల్లులను, వస్తువులను రికార్డు చేసుకొనుటకు, పరిశీలనకు, తనిఖీకి మరియు కావలసిన పత్రాలు జీరాక్స్ సర్టిఫైడ్ కాపీలు తీసుకొనుటకు రెండు ఖచ్చితమైన తేదీలు, సమయాలను సూచించగలరు.

1. తేది 29-12-2009 నుంచి 31-12-2009 వరకు ఐ&సీఏడీ కార్యాలయ అవసరాల కోసం డబ్బు చెల్లించిన స్టేషనరీ, ఇతర కొనుగోలుకు సంబంధించిన (జీ.వో. ఆర్టీ నంబర్లు 1907 నుంచి 1920 వరకు) కొనుగోలు బిల్లులు మరియు కొనుగోలు చేసిన వస్తువులను వీడియో రికార్డు ద్వారా, స్టిల్ కెమేరా ద్వారా రికార్డు చేసుకొనుటకు, పరిశీలనకు, తనిఖీకి మరియు కావలసిన పత్రాలు జీరాక్స్ సర్టిఫైడ్ తీసుకొనుటకు రెండు ఖచ్చితమైన తేదీలు, సమయాలను పంపగలరు.

ఆంధ్రప్రదేశ్ సమాచార (రుసుం మరియు ధరల నియంత్రణ) నియమాలు 2005 ప్రకారం దరఖాస్తు రుసుం రూ.10-00లు కోర్టు ఫీ స్టాంపులు అతికించడమైనది.

జీ. శ్రీనివాసరావు,
C/o. సిటిజన్ హెల్ప్ సెంటర్,
లోక్‌సత్తా పార్టీ కార్యాలయం,
# 11-18-90/1, భగత్‌సింగ్ నగర్,
సరూర్‌నగర్ - 500 035,
రంగారెడ్డి జిల్లా.
సెల్ నం. 9573 593 573.

G. Srinivasa Rao
(జీ. శ్రీనివాసరావు)

నోట్: 1. ఉత్తర ప్రత్యుత్తరాలు అధికార భాష తెలుగులో మాత్రమే పంపగలరు. దరఖాస్తుపై అధికారులకు కలిగే సందేహ నివృత్తికి పైన పేర్కొన్న సెల్ నంబరుకు ఫోన్ చేయగలరు.
2. జీ.వో.ఎంఎస్ సంఖ్య 114, జీఏ (సర్వీసులు-సి)డీ., మార్చి 16, 2009 ప్రకారం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారులు కోరిన పూర్తి, ఖచ్చితమైన సమాచారమివ్వడం ప్రభుత్వోద్యోగి బాధ్యతని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం.

# అనుబంధం - 2

Top priority

**సమాచారం కోసం దరఖాస్తు**

సమాచార హక్కు చట్టం

Top priority

25.01.10

తేది: 20.12.2009

ప్రజా సమాచార అధికారి,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు కార్యాలయం,
శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం,
చెరువుగట్టు గ్రామం, నార్కట్‌పల్లి మండలం
నల్గొండ జిల్లా.

ప్రజా సమాచార అధికారి గారికి,

సమాచార హక్కు చట్టం 2005, సెక్షన్ 6(1) ప్రకారం కింది విషయాలకు సమాచారాన్ని సెక్షన్ 7(1) ప్రకారం వీలైనంత త్వరగా లేదా 30 రోజుల్లో సెక్షన్ 2 (జె) ప్రకారం రికార్డుల తనిఖీకి రెండు తేదీలు, ఖచ్చిత సమయాలను మరియు తనిఖీ సమయంలో కావలసిన పత్రాలు సర్టిఫైడ్ తీసుకొనుటకు అనుమతిని పంపగలరు.

1. దరఖాస్తుకు సమాచారం పంపేతేదీకి రికార్డుల ప్రకారం శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన కళ్యాణ మండపాలు, కాటేజీలు, స్టాల్లు, షాపులు, క్యాంటీన్లు, ఖాళీ స్థలం, స్కూటరు, సైకిల్ స్టాండు, కారు, ట్రక్కు పార్కింగ్ వగైరాల కాంట్రాక్టు పొందిన వాస్తవ వ్యాపారుల (టెండరుదారులు లేదా లీజుదారులు) ఖచ్చిత పేర్లు, తండ్రి/భర్త పేర్లు, నివాస చిరునామాల (ఖచ్చిత ఇంటి/డోర్/ఫ్లాట్/సర్వే నంబర్లు, వీధి పేరు, ఊరి పేరు, మండలం, జిల్లా) జాబితా పంపగలరు

2. సంబంధిత దేవస్థానానికి సంబంధించిన టెండరుదారులకు కేటాయించిన స్టాల్ నంబరు, ఖచ్చిత ఇంటి/డోర్ నంబర్లు, వీధి పేరు, వ్యాపార స్వభావం, పక్కా లేదా ఖాళీ స్థలం పొడవు, వెడల్పు (అడుగులు, గజాలు, మీటర్లలో), ఒక్కో నెలకు టెండరుదారులు చెల్లిస్తున్న అద్దె విలువ, ప్రస్తుత టెండరుదారుల టెండరు కాల పరిమితి (ప్రారంభ తేదీ, ముగింపు తేదీ) పంపగలరు.

3. 2005 - 06 ఆర్థిక సంవత్సరం నుంచి దరఖాస్తుకు సమాచారం పంపేతేదీ వరకు దేవస్థాన ఉన్నతాధికారి మరియు పాలక వర్గం విచక్షణాధికారంతో జరిపిన కొనుగోలు బిల్లులు, చెల్లింపులకు సంబంధించిన రికార్డులను సెక్షన్ 2 (జె) (iv) ప్రకారం స్వంత ఖర్చులతో వీడియో కెమెరా మరియు స్టిల్ కెమెరా ద్వారా రికార్డు చేసుకొనుటకు (కేంద్ర సమాచార కమిషన్ అప్పీలు సంఖ్య సీఐసీ/డబ్ల్యుబి/ఎ/ 2006/144, తేది: 20-03-2006 ప్రకారం) రెండు తేదీలను, ఖచ్చితమైన సమయాలను తెలుపగలరు.

సమాచార హక్కు (రుసుం మరియు ధరల నియంత్రణ) నియమాలు 2005 ప్రకారం దరఖాస్తు రుసుం రూ.10-00లు కోర్టు ఫీ స్టాంపులు అతికించడమైనది.

జి. శ్రీనివాసరావు,

ఇట్లు

G. Srini Vasa Rao

(జి. శ్రీనివాసరావు)

భారతీయ డాక
India Post
SARDDRNAGAR SO <500035>
RLA 7974
Counter No:1,OP-Code:PP
To:PUB INF OFFICER,CHERUVUGATTU
NALGONDA

Wt.:20grams,
PS:22.00, , 29/01/2010 , 12:13
<<Have a nice day>>

లో మాత్రమే పంపగలరు. దరఖాస్తుపై అధికారులకు కలిగే సందేహ
).
(సర్వీసులు-సి) శాఖ, మార్చి 16, 2009 ప్రకారం సమాచార హక్కు
మాచారమివ్వడం ప్రభుత్వోద్యోగి బాధ్యతని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం.

# అనుబంధం -3

RTI ACT :: MOST URGENT

NO:23

**By Regd Post with Ack Due.**

GOVERNMENT OF ANDHRA PRADESH
IRRIGATION & COMMAND AREA DEVELOPMENT(Genl.VI) DEPARTMENT

Letter No.3988/Gen.VI/2010-3, Dated:- 5-3-2010

From:

The Deputy Secretary to Government &
State Public Information Officer,
I&CAD Department,
A.P.Secretariat,
HYDERABAD.

To:

Sri. G.Sreenivasa Rao,
C/O Citizen Help Centre,
Lok Satha Party Office,
11-18-90/1, Bhagath Singh Nagar,
Saroor Nagar, Ranga Reddy District,
Pin-500035.

Sir,

Sub:- RTI Act-2005-I&CAD Dept- Sri. G. Sreenivasa Rao, R/O Hyderabad-Requested information under RTI Act-2005- Reg.

Ref:- Representation Dt: 3-2-2010, from Sri G. Sreenivasa Rao, R/O, Hyderabad.

***

With reference to your representation in the reference Cited, I am to inform that you inspect the bills etc on 7-4-2010 & 13-4-10 in I & CAD (IW:OP) Department 'J' Block 6th Floor as desired by you under RTI Act-2005.

Yours faithfully,

For DEPUTY SECRETARY TO GOVERNMENT
& STATE PUBLIC INFORMATION OFFICER

Received
11/3/10

# అనుబంధం - 4

సహాయకమీషనర్ & కార్యనిర్వాహణాధికారి కార్యాలయము,
శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము,
చెరువుగట్టు, నార్కట్‌పల్లి మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం. 8/ఎస్‌పిజెఆర్ఎస్‌డి/2010.

తేది: 26-02-2010.

శ్రీ జి. శ్రీనివాసరావు,
ఇంటి నెం. 4-6-87/1, కాస్‌బాగ్,
హయత్‌నగర్ - 501 505,
రంగారెడ్డి జిల్లా గారికి.

ఆర్యా,

విషయము:- దేవదాయ ధర్మదాయ శాఖ - నల్లగొండ జిల్లా - నార్కట్‌పల్లి మండలము - శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము - సమాచార హక్కు చట్టం - రికార్డులు సమర్పణ - గురించి.

సూచన:- శ్రీ జి. శ్రీనివాసరావు, హయత్‌నగర్ గారి ధరఖాస్తు తేది. 25-01-2010.

* * *

పై విషయమును పురస్కరించుకొని తమకు తెలియచేయునది ఏమనగా, సూచనలోని ధరఖాస్తు ద్వారా మీరు కోరిన వివరములు ఈ క్రింద చూపడమైనది.

1. సదరు దేవస్థానమునకు చెందిన భవనములు, షాపులు, ఖాళీ స్థలములు, టెండరు దారులు లేదా లీజు దారులు) వివరములు:
   - అ. కళ్యాణ మండపాలు, కాటేజీలు, స్టాళ్లు, క్యాంటీన్లు : లేవు.
   - ఆ. షాపులు. : స్టేట్‌మెంట్ జతపరచనైనది.
   - ఇ. ఖాళి స్థలం. : శ్రీ అమ్మవారి దేవాలయ ప్రాంగణము.
   - ఈ. స్కూటర్, సైకిల్ స్టాండు, కారు, ట్రక్కు పార్కింగ్ టెండరు దారుల వివరములు : స్టేట్‌మెంట్ జతపరచనైనది.
2. టెండరు దారుల వివరములు. : స్టేట్‌మెంట్లు జతపరచనైనది.
3. 2005-06 సం॥ ఆర్థిక సంవత్సరము నుండి రికార్డులు వీడియో మరియు స్టిల్ కెమెరాల ద్వారా తీసుకొనుటకు రెండు తేదీలు : తేది: 12-03-2010 మరియు తేది: 20-03-2010 లలో ఉదయం గం॥ 11.00 లకు రాగలరు

భవదీయుడు,
26/02/10
సహాయ కమీషనర్ &
కార్యనిర్వాహణాధికారి

Assistant Commissioner &
Executive Officer
Sri Parvathi Jadala Ramalingeshwara
Swamy Temple, CHERUVUGATTU.

Received
28/2/10



# కందుకూరి వీరేశలింగం

## 1848 – 1919

బాల్యవివాహాలను, కన్యాశుల్కాన్ని దునుమాడి నిషేధిత స్త్రీ విద్యకై
1874లోనే పాఠశాలను స్థాపించిన మహనీయుడు
స్త్రీ జాతి పురోగతికై అహర్నిశలు శ్రమించి
హితకారిణీ సమాజాన్ని నెలకొల్పి  యావదాస్థిని వ్రాసి ఇచ్చిన దానకర్ణుడు

గద్యతిక్కనగా పేరుగాంచి తెలుగుభాషకు గురజాడ, గిడుగుల తోడుగా వ్యావహారిక నడకలు నేర్పి
సామాజిక దుర్గ్మతలను ఖండించే ఆయుధంగా సాహిత్యాన్ని ఎంచుకుని
100కు పైగా  రచనలు చేసిన సాహితీవేత్త
మన సమాజ దుస్థితికి స్త్రీల దురావస్థే కారణమని నమ్మి
స్త్రీ జన ఉద్ధరణకు నడుం బిగించి
స్త్రీలను పడుపువృత్తిలో దింపే దురాచారాలను ప్రతిఘటించి
అధికారుల్లోని అవినీతిని చీల్చి చెండాడుతూ
' వివేకవర్ధిని'  పత్రికను దినదిన ప్రవర్ధమానంగా నడిపించి
' సతీహితబోధిని ' పత్రిక ద్వారా స్త్రీల సాధికారతను, హక్కులను తెలియచెప్పిన సంఘసంస్కర్త
విధవరాండ్లకు వసతిగృహం నిర్మించి, విధవలకు పునర్వివాహాలని ప్రబోధించి
సమాజానికి ఎదురొడ్డి మొట్టమొదటి విధవ వివాహాన్ని జరిపించిన ధీశాలి
అటువంటి సంఘసంస్కర్త వారసులం మనం
ఒకటిన్నర శతాబ్ధాలు గడిచినా అవే సమస్యలతో అతలాకుతలమవుతోంది మన సమాజం

రండి...!

ఆధునిక భారతావనిని నిర్మిద్దాం
కలిసి అడుగులు వేసి నిజమైన సమసమాజాన్ని సాధిద్దాం...

అందుకే....
మనచేత.... మనకోసం...

లోకసత్తా పార్టీ

RNI.Ref. No. Nil-1/10/2009, Verification Date: 27/11/2009



Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, for and on behalf of Foundation for Democratic Reforms ,
Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 0082, and printed at Kala Jyothi Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad